తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త





## జనసంద్రంగా కాణిపాకం ఆలయం



కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
శ్రీవరసిది వినాయక స్వామి అలయం ఆదివారం పోటెత్తిన భక్తులతో పోటెత్తింది. సాధారణంగా ఆలయంలో వారంతపు రోజులు శని, ఆదివారాలు, వరుస సెలవు రోజుల్లో భారీ స్థాయిలో రద్దీ వుంటుంది. ఈమేరకు ఆదివారం ప్రభు త్వ సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాల నుండి భక్తులు అనూహ్యంగా ఆలయ దర్శనార్థం పెద్ద ఎత్తున తరలివచ్చారు. అలాగే సాధారణ భక్తులతో పాటు తిరుమల తీర్థజనం కూడా కాణిపాకం స్వామి వారి దర్శనార్థం రావడంతో ఆలయంలో ఉదయం నుండి రాత్రి వరకు తీవ్ర

## నూతన ఎస్పీ పి.జాషువ బాధ్యతల స్వీకరణ



చిత్తూరు, ఫిబ్రవరి 4ప్రభాతవార్త:
ఎలక్షన్ కమీషన్ మారదర్శకాలు, నిభందనల మేరకు జిల్లాలో 2024 సార్వత్రిక ఎన్నికలను కట్టుదిట్టంగా నిర్వహించడానికి చర్యలు తీసుకుంటామపి ఎస్పీ జాషువ పేర్కొన్నారు. ప్రశాంత్ నగర్‌లోని జిల్లా పోలీసు కార్యాలయంలో ఆదివారం బదిలీపై వెళుతున్న ఎస్పీ రిషాంత్ రెడ్డి నుండి ఎస్పీ పి.జాషువ బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరి రక్షణకు పోలీసు యంత్రాంగం చర్యలు తీసుకుం టుందన్నారు. తనకు జిల్లా సుపరిచితమని తాను ఇదివరకే జిల్లాలో విధులు నిర్వహించడం జరిగిందన్నారు. క్రిష్ణా జిల్లా ఎస్పీగా విధులు నిర్వహిస్తున్న పి.జాషువ ను చిత్తూరు జిల్లా ఎస్పీగా బదిలీ కావడం జరిగింది. అనంతరం ఎస్పీగా బాధ్యతలను స్వీకరించిన జాషువ పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించారు.

# అభివృద్ధిని ఆశీర్వదించండి

### మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



నాయుడుపేట రూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త ; రాష్ట్రంలో పేదప్రజల అభివృద్ధి కోసం ముఖ్య మంత్రి వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలను అభివృద్ధి చేస్తున్నారని జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు వైయస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని ఆశీర్వదించాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. ఆయన ఆదివారం నాయుడుపేట మండలంలోని మేనకూరులో నూతనంగా నిర్మించిన వైయస్ఆర్ శృతివనం ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. అనంతరం వైయస్ఆర్ శృతివనం, రైతుభరోసా కేంద్రం, వైయస్ఆర్ హెల్త్‌క్లీనిక్‌లను ఆయన చేతులమీదుగా ప్రారంభించారు. ఈసంద ర్భంగా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రెడ్డి మాట్లడుతూ దేశంలో ఏరాష్టంలో చేపట్టని పథకాలను ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టి పేదప్రజలను అబివృద్ధి చేస్తున్నాడని ఆయన తెలియజేశారు. అభివృద్ధిని ఓర్వలేక ప్రతిపక్షాలు బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ప్రజలు అంత గమనిస్తూన్నరని వారికి దగ్గరలోనే గుణపాఠం చెప్తారన్నారు. మేనకూరు అభివృద్ధికి మూలకారణం దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. మేనకూరుకు పరిశ్రమలు రావడంతో భాగా అభివృద్ధి చెందడం అనేక మంది యువతకు ఉద్యోగ అవకాశాలు కలిగాయన్నారు. ఆయన పేరు తో శృతివనం ఏర్పటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. అదేవిధంగా కుటుంబంలో చిన్నచిన్న మనస్పర్ధలు ఉంటాయి కుటుంబ పెద్దలుగా ఎమ్మెల్యే, ఎంపి అభ్యర్ధులు అందరిని కలుపుకోని పోవాలని ఆయన సూచించారు. మనమంతా జగన్‌మోహన్‌రెడ్డి సైనికులుగా ఎన్నికల యుద్ధంలో విజయం సాదించి జగన్నను మరోసారి ముఖ్య మంత్రి చేసుకోవాల్సిన భాధ్యత మనందరిపై ఉందన్నారు. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య మాట్ల డుతూ మేనకూరులో 1,5కోట్లుతో వైయస్ఆర్ శృతివనం, 17.67లక్షలతో జగనన్న పాలవెల్లువ, 23.94లక్షలతో రైభరోసాకేంద్రం, 20.80లక్షలతో వైయస్ఆర్ హెల్త్‌క్లీనిక్. 16లక్షలతో వైయస్ఆర్ డిజిటల్ లైబ్రరీని నిర్మించి మేనకూరును అభివృద్ధి చేయడం జరిగిందన్నారు. తిరు పతి ఎంపి మద్దిల గురుమూర్తి, వెంకటగిరి సమన్వ యకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, కట్టా సుదాకర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి, కమలాకర్‌రెడ్డి, రపి, నల్లా కస్తూరయ్య, తదితర నాయకులు, అధికారులు ఉన్నారు.

### హిందూధర్మం విశ్వవ్యాప్తికి

# పీఠాధిపతులు ఏకం కావాలి



**-పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వవికాస శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి**
**-ధార్మికసదస్సులో పలువురు స్వామీజీలు**

తిరుమల, ఫిబ్రవరి 4ప్రభాతవార్తప్రతినిధి:
హిందూ సనాతనధర్మాన్ని విశ్వవ్యాప్తం చేసేందుకు దేశంలోని పీఠాధిపతులు, మఠాదిపతులు ఏకం కావాలని పలువురు తమతమ అభిప్రా యాలు వెల్లడించారు. ఇందుకు టిటిడి ముందు వరుసలో ఉంటుందని స్వామీజీలు తెలిపారు. తిరుమల ఆస్థానమండపంలో జరు గుతున్న ధార్మికసదస్సు రెండవరోజు ఆదివారం 17మంది స్వామీజీలు పాల్గొని తమతమ అనుగ్రహభాషణం చేశారు. హిందు వులను తిరిగి సనాతన హిందూ ధర్మంవైపు తీసుకురావడానికి ఘర్‌వాపసీ కోసం ప్రోత్సాహం అందించాలని కంచికామకోటి పీఠాధిపతి శంకరవిజయేంద్రసరస్వతిస్వామి తెలిపారు. ఉత్తర దేశంలోని ప్రాచీన ఆలయాల్లో కూడా ధార్మిక ప్రచారం జరగాలన్నారు. భక్తులు తిలకధారణ చేయడం ద్వారా హైందవ ధర్మవ్యాప్తికి కృషి చేయాలన్నారు. టిటిడి సహకారంతో ఎన్నో సేవా, ధార్మిక కార్యక్రమాలు అమలవుతున్నాయని అభినందించారు. తిరుపతిలో కరుణాకర్‌రెడ్డి చక్కటి రోడ్డునిర్మించి చంద్రశేఖరసరస్వతిస్వామి పేరు పెట్టడం శుభపరిణామమన్నారు.

**పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వవికాసశిక్షణ:చిలుకూరు సౌందరరంగరాజన్**
తెలుగురాష్ట్రాల్లోని పాఠశాలల్లో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస శిక్షణ కార్యక్రమాలు చేపట్టాలి. బుర్రకథలు, ఒగ్గుకథలు ప్రోత్సహించాలి. ఆలయాల్లో ధర్మపరిరక్షణకు అర్చకుల్ని భాగస్వాముల్నిచేయాలి.



**తిరుమల తరహాలో అన్నిప్రాంతాల్లో గోవిందనామస్మరణ: రేవతిరమణదాస్**
టిటిడి మంచి ధార్మికకార్యక్రమాలు చేపడుతోందని, తిరుమల తరహాలో అన్ని ప్రాంతాల్లో గోవిందనామస్మరణ జరగాలి. దేశవ్యాప్తంగా గోశాలలు ఏర్పాటుచేయాలి. టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి ప్రత్యేకశ్రద్ధతో రామాయణ, భాగవతంసహా పలు కార్యక్రమలు నిర్వహిస్తున్నారు.

**-వేదఅధ్యయనం విద్యార్థులకు మరింతగా ఆర్థికసాయం:**
**ఉడిపి విద్యావల్లభతీర్థస్వామి**
వేదఅధ్యయనం చేస్తున్న విద్యార్థులకు మరింతగా ఆర్థికసహాయం చేయాలి. గుడికో గోమాత విజయవంతం కావడం టిటిడివల్ల నేననాన్నరు. మన సనాతన సంప్రదాయాన్ని నిలిపేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలి.

**- హిందువులకు టిటిడి ఒకవరం: గన్నవరం కమలానందభారతి**
ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులకు భగవంతుడు ఇచ్చిన వరం టిటిడి. అప్పట్లో భూమన కరుణాకర్‌రెడ్డి దళితగోవిందం గొప్ప కార్యక్రమంతో ఎందరో దళితులు, వెనుకబడినవర్గాల ప్రజలు ఈ కార్యక్రమాన్ని చక్కగా వినియోగించుకున్నారు.

**-ధర్మాచరణపట్ల యువతకు ఆసక్తిపెంచాలి: కడప అనుపమానందమహరాజ్**
ధర్మాచరణ పట్ల యువతకు ఆసక్తిని పెంపొందించాలి. సంస్కృత భాషను ప్రోత్సహించాలి. భవిష్యత్ తరాలకు ధర్మాన్ని ఆచరించడానికి మరిన్ని మెరుగైన ప్రయత్నాలు చేపట్టాలి.

**-సదస్సులో తీసుకున్న నిర్ణయాలు అమలుచేయాలి: :పుష్పగిరివిద్యాశంకరబారతిస్వామి**
ధార్మికసదస్సులో తీసుకున్న నిర్ణయాలు అమలుచేయాలి. సాంప్రదాయ పరిరక్షణ కోసం అందరూ పనిచేయాలి. అద్భుతమైన పనుల్ని టిటిడి చేస్తోంది.

# సికే బాబుకు మరోసారి టిడిపి గాలం

### -జాతీయ తెలుగుదేశం అధ్యక్షులు చంద్రబాబు సభకు ఆహ్వానం



చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:
చిత్తూరు, పూతలపట్టు, గంగాధర నెల్లూరు నియోజకవర్గలలో మంచి పట్టు ఉన్న సికే బాబుకు మరో సారి టిడిపి గాలం వేసింది. గంగాథర నెల్లూరు మండలంలో మంగళవారం జాతీయ తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు తెలుగు దేశం పిలుస్తుంది కదలిరా.. కార్యక్రమాన్ని ప్రతీష్టాత్మకంగా చేపడుతుం ది. కార్యక్రమానికి హాజరు కావాలని మాజీ ఎమ్మెల్యే సి.కే బాబుకి ఆహ్వానించినట్లు తెలుస్తుంది. ఈ మేరకు రాయలసీమ జిల్లాల కోఆర్డీనేటర్ ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే సికే బాబును ఆయన నివాసంలో కలసి తెలుగదేశం పిలుస్తుంది కదలి రా కార్యక్రమానికిఆహ్వానించినట్ల సమాచారం. 2019 ఎన్నికలకు ముందు మాజీ ఎమ్మెల్యే సికే బాబు బిజేపికి రాజీనామా చేసి టిడిపిలో చేరారు. 2019 ఎన్నికలలో రాష్ట్రంలో టిడిపి ఓటమి పాలై వైకాపా అధికారంలో రావడంతో ఆయన రాజకీయాలకు దూరంగా ఉన్నారు. తెలుగు దేశం పార్టీలో ఉన్నప్పటికి పార్టీ నిర్వహించే ఏ ఒక్క కార్యక్రమాలకు హాజరు కాలేదు. తెలుగు దేశానికి రాజీనామా చేసి వైకాపాలో చేరుతారన్న ఊహాగానాలు రావడం జరిగింది. అయితే చిత్తూరు అభ్యర్థిపేరును స్పష్టం చేస్తే తాను చంద్రబాబు సమావేశానికి వస్తానని తెలిపినట్లు తెలుస్తుంది.

### ఒంటరి ఏనుగు దాడిలో

# యువకుడికి గాయాలు.. కారు ధ్వంసం

గుడుపల్లె/శాంతిపురం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



ఏనుగుల దాడిలో గాయపడ్డ వెంకటాచలం, మామిడితోట వద్ద ఉన్న అటవీ అధికారులు

కర్ణాటకనుంచి నుంచి వచ్చిన ఒంటరి ఏనుగు గుడుపల్లె, శాంతిపురం మండలాల్లో హల్‌చల్ సృష్టించింది. గుడుపల్లె మండలం అత్తినత్తం వద్ద కృష్ణప్ప కుమారుడు వెంకటాచలం పొలాల నుంచి ఇంటికి వస్తుండగా ఒంటరి ఏనుగు అతనిపై దాడికి దిగింది. దీంతో అక్కడనుంచి తప్పిం చుకున్న వెంకటాచలంను కుటుంబీకులు చికిత్స నిమిత్తం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. ఇతని కాలికి తీవ్రగాయాలయ్యాయి. అలాగే శాంతిపురం మండలం కోనేరుకుప్పం, గొల్లపల్లి ప్రాంతాల్లో ఇదే ఏనుగు ఆదివారం సంచరించింది. గ్రామానికి చెందిన ఉమాశంకర్‌రెడ్డి యొక్క కారుపై దాడి చేసి బంపర్‌ను ధ్వంసం చేశాయి. ఉమాశంకర్‌రెడ్డి కారులోనే ఉండి మెల్లగా తప్పించుకున్నాడు. ప్రసాదాచారికి చెందిన ఆవుపై సైతం ఏనుగు దాడికి దిగింది. వెంకటరెడ్డి మామిడితోటలో ఫెన్సింగ్ ధ్వంసం చేసి అక్కడే మకాం పెట్టింది. విషయం తెలుసుకున్న గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం ఇచ్చారు. డిఆర్వో పుల్లయ్య సిబ్బందితో అక్కడకు చేరుకుని ప్రజలను అప్రమత్తం చేశారు. రాత్రిపూట ఎవరూ వ్యవసాయ పొలాల వద్దకు రావద్దని హెచ్చరించారు. ఏనుగు జాడను గుర్తించి తరిమేందుకు అటవీ సిబ్బంది మామిడితోట వద్దనే వేచి ఉన్నారు.

# పాతగుంట, సింగపూరు గ్రామాల్లో జల్లికట్టు



గిత్తను నిలువరించే ప్రయత్నం చేస్తున్న యువకులు

వెదురుకుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :
మండలంలోని పాతగుంట, మాంబేడు పంచాయితీ పరిధిలోని సింగపూరు గ్రామాల్లో ఆదివారం కనుల పండువగ పశువుల పందెల పోటీలను నిర్వహించారు. అల్లె వద్ద గిత్తలను పోటీలకు వదలడంతో యువకులు ఉత్సహంగా బరిలోకిదిగి చెక్కపట్టీల కోసం కుస్తీపడ్డారు. సంక్రాంతి పండుగ సందర్భంగా జరుపుకునే గిత్తల కుస్తీ పందెలను చేపట్టారు. పాతగుంటలో సర్పంచ్ భూవనేశ్వరి, మండల గృహసారథులు కమిటీ కన్వీర్ బట్టే సుబ్రమణ్యం, నాయకులు బొజ్జా రెడ్డి, కొండా రెడ్డి, గోవిందన్, భాస్కర్ రెడ్డి, మునస్వామి రెడ్డి, గణపతి రెడ్డిలు పోటీలను ప్రారంభించారు. రెండు గ్రామాలకు చెందిన యువకులు గ్రామంను రంగు పేపర్లు, మాడితోరణాలతో అందంగా ముస్తాబు చేశారు. రైతులు తమ కోడిగిత్తలకు కొమ్ములు చెక్కి రంగులు వేసి వివిధ అంకరణతో ముస్తాబు చేయడంతో పాటు కొమ్ములకు తమ ఇష్టామైన రాజకీయ నాయకులు, దేవుళ్ళ, సినిమా హీరోల చిత్రాలతో కూడిన చెక్కపట్టీలను కట్టించి అలంకరించారు. కొందరు రైతులు గిత్తలకు టవల్, నగదు బహుమతులు కట్టి పోటీకి దించారు. చుట్టుప్రక్కల గ్రామాల నుంచి గిత్తలను పందెలకు తీసుకురావడం జరిగింది. అల్లె వద్ద కుస్తీకి సిద్ధమైన యువకులు ఉత్సహంతో ఈలలు, కేరింతలు, డప్పుల దరువుల నడుమ పౌరుషంతో పోటీలకు దిగడంతో గ్రామస్థులు గిత్తలను వదలి పెట్టారు. రెంటించిన పౌరుషంతో గిత్తలు జనంను చీల్చుకుంటు డప్పుల దరువులు మధ్య పరుగులు తీశాయి. యువకులు పట్టుజారకుండా గిత్తలను పట్టుకోవడంకు ప్రయత్నాలు చేశారు. కొన్ని గిత్తలు దొరకగా మరికొన్ని గిత్తలను జనం మధ్య పరుగులు తీశాయి. చెక్కపట్టీలు దక్కించుకున్న యువకులు కేరింతలు కొట్టి, విజయదరహాసంతో ఊగిపోయారు.

# భద్రత లోపాలను సరిదిద్దుకుందాం: సుపరిపాలన అందిద్దాం:

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో భద్రత లోపాలకు సంబంధించి సరిదిద్దుకొని సుపరిపాలన అందించుటకు ఆలయ సిబ్బంది భద్రతా సిబ్బంది సహకరించాలని చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు సూచించారు. ఆదివారం ఆలయంలోని తన ఛాంబర్‌లో ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. మూడు రోజుల క్రితం జరిగిన సంఘటన ఆలయ భద్రతకు సవాలుగా మారిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ధర్మకర్తల మండలి చైర్మెన్ లోపాలెక్కడున్నాయి? నివారణకు ఏం చర్యలు తీసుకోవాలనే అంశాలను చర్చించారు. ఆలయ ఎసి మల్లికార్జున్ ప్రసాద్ సారధ్యంలో ఎస్.టి.ఎఫ్, హోంగార్డులు, ఆలయ సెక్యూరిటి, ఇంజనీరింగ్ విభాగం, ఇతర శాఖల అధికారులు హాజరు కాగా చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు అధ్యక్షత వహించారు.

**మూడంచెల భద్రత:**
ఆలయానికి సంబంధించి మూడంచెల భద్రత ఎంతో అవసరమని చైర్మెన్ శ్రీనివాసులు అభిప్రాయపడ్డారు. అయితేభద్రతకు సంబంధించి పని చేస్తున్న వారు విధుల్లో ఎదుర్కొంటున్న



సమీక్ష జరుపుతున్న చైర్మెన్

సమస్యలను వివరించగా చైర్మెన్ విన్నారు. ఇంజనీరింగ్ శాఖ పలు సూచనలు చేసింది. అందరి అభిప్రాయాలు విన్న ఆయన ఆలయంలో 'మూడంచెల భద్రత వ్యవస్థ' ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. అందుకు ఆలయం పై భాగంలో రాత్రి వేళల్లోనూ, పగలు నిరంతర గస్తీ ఎంతో అవసరమని అభిప్రాయపడ్డారు. ఇందుకు రాత్రి వేళల్లో ఫ్లడ్ లైట్లను ఏర్పాటు చేయాలని ఇంజనీరింగ్ విభాగాన్ని ఆదేశించారు. నాలుగు

### అన్నిశాఖలతో చైర్మెన్ సమన్వయ సమావేశం

గోపురాల్లో వాచ్ టవర్స్ ఏర్పాటు చేసి తగినంత సిబ్బందిని నియమించి 24గంటలూ పర్యవేక్షణ ఉండే విధంగా చర్యలు తతీసుకోవాలని ఆలయాధికారులకు సూచించారు. భద్రతా సిబ్బంది మధ్య కమ్యూనికేషన్ కోసం మరో 30 వాకీ టాకీలను వెంటనే అందించాలని ఆదేశించారు. అలాగే 3వ గేటు వద్ద ఉపయోగంలో లేని షాపులను తొలగించాలని ఆదేశించారు. స్థపద మండపం తూర్పు గోడపై ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలన్నారు. అలాగే రాత్రి వేళల్లో ఫోకస్ లైట్లు ఏర్పాటు చేయాలని ప్రకారం లోపల మరిన్ని సిసి కెమెరాలు ఏర్పాటుకు సమావేశం నిర్ణయించింది. తిరుపతి ఎస్పితో చర్చించి మరింత అదనపు సిబ్బంది ఆలయానికి కేటాయించే విధంగా చర్యలు తీసుకుంటామని చైర్మెన్ శ్రీనివాసులు వివరించారు. సమావేశంలో ఎసి మల్లికార్జున్ ప్రసాద్, సిఎస్ఓ నాగభూషణం యాదవ్, ఇంజనీరింగ్ శాఖకు చెందిన శివకిషోర్, సెక్యూరిటి ఇన్‌చార్జి మణి, ఎస్పిఎఫ్‌కి చెందిన ఉమాపతి తదతరులు పాల్గొన్నారు.

# స్విమ్స్‌లో క్యాన్సర్‌పై అవగాహన ర్యాలీ

తిరుపతి టౌన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త
స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆదివారం స్విమ్స్ ఆసుపత్రిలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా స్విమ్స్ శ్రీ పద్మావతి హాస్పిటల్ నుండి వాల్మికి సర్కిల్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ ర్యాలీని ఏపి స్పెషల్ చీఫ్ సెక్రటరీ హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంటి కృష్ణబాబు జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. అనంతరం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా స్విమ్స్ పద్మావతి హాస్పిటల్ నుండి వాల్మీకి సర్కిల్ వరకు అవగాహన ర్యాలీలో తిరుపతి జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీషా, స్విమ్స్ డైరెక్టర్, వైస్ చాన్సలర్ డా. ఆర్వి కుమార్, బయో ప్రత్యేకాధికారి డా. ఎం. జయచంద్రారెడ్డి, తిరుపతి డిఎం అండ్ హెచ్ఓ డా. శ్రీహరి, స్విమ్స్ ఎంబిబిఎస్ నర్సింగ్ ఫిజియోథెరఫీ, విద్యార్ధిని విద్యార్థులు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏపి స్పెషల్ చీఫ్ సెక్రటరీ హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంటి కృష్ణబాబు మాట్లాడుతూ ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించడానికి స్విమ్స్ శ్రీ బాలాజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజి విభాగం ఆధ్వర్యంలో కాన్సర్ అవగాహన పై ర్యాలీ నిర్వహించామన్నారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ బారిన పడితే ఇంకా చనిపోవడం ఖాయమని అనే అపోహలు వున్నాయి. అయితే క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా లైఫ్ టైమ్‌ను పెంచుకోవచ్చునని తెలియజేసారు. క్యాన్సర్ చివరి దశలో అయితే క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా లైఫ్ టైమ్‌ను పెంచుకోవచ్చునని తెలియజేసారు. క్యాన్సర్ చివరి దశలో వున్నప్పటికి పాలియేటివ్ కేర్ ద్వారా కొంత వరకు ఉపశమన చికిత్సను అందించి పేషంట్ సంతోషంగా జీవించేందుకు స్విమ్స్ ద్వారా వైద్యం అందిస్తున్నట్లు తెలియజేసారు. క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా వ్యాస, పోస్టర్ కాంపెటేషన్‌లో విజేతలకు సర్టిఫికేట్స్‌ను ఎంటి కృష్ణబాబు విద్యార్ధినీలకు అందజేసారు. అనంతరం శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ నూతనంగా నిర్మిస్తున్న జల్డింగ్‌ను ఏపి స్పెషల్ చీఫ్ సెక్రటరీ హెల్త్ మెడికల్, ఫ్యామిలీ వెల్ఫేర్ ఎంటి కృష్ణబాబు పరిశీలించి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. స్విమ్స్ ఆసుపత్రిలో పెరిటోనియల్ డయాలసిస్ యూనిట్‌ను పరిశీలించారు. . స్విమ్స్ నెఫ్రాలజి విభాగాధిపతి రామ్ పర్యవేక్షణలో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఆర్ఎంఓ డా. కోటిరెడ్డి, డిపిఎంఓ డా. శ్రీనివాస్, శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల ప్రిన్సిపల్ డా. ఉషాకళావత్, కమ్యూనిటీ మెడిసిన్ విభాగాధిపతి డా. నాగరాజు, నర్సింగ్ ప్రిన్సిపల్ డా. సుధారాణి, డిప్యూటి డైరెక్టర్ ప్రభావతి, ఎంఎస్‌డబ్ల్యూ ప్రసాద్, బయో సిబ్బంది, వివిధ విభాగాధిపతులు, సిబ్బంది, విద్యార్ధిని విద్యార్థులు పాల్గొన్నారు.



క్యాన్సర్ పై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

### నగరపాలికలో

# లాగిన్ దొంగల హల్చల్?

**కార్యాలయం లాగిన్ ఇతరులకు పంపుతున్న ఇంటి దొంగలపై చర్యలేవి?**



తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త
నగరపాలక సంస్థ కార్యాలయంలో లాగిన్ దొంగల హవా ఎక్కువైందని పలువురు ఉద్యోగులు బహిరంగంగా అంటున్నారు. నగర పాలక సంస్థలో అనేక విభాగాలు ఉన్నాయి. ఆయా విభాగాలకు సంబంధించి ఆన్‌లైన్ ఫైల్స్ ఒక్కొక్క అధికారి లాగిన్‌కు వెళ్లి వస్తుంటాయి. అయితే ఇక్కడ అధికారులకు సమయం లేకనో లేదా కంప్యూటర్‌పై పరిజ్ఞానం లేకనో కార్యాలయంలో ఉన్న కంప్యూటర్ ఆఫరేటర్లు మీద ఆధారపడి ఆన్‌లైన్ ఫైల్స్ పంపుతున్నారు. ఇదే అదునుగా భావించిన కొంత మంది పలు అక్రమాలకు పాల్పడుతున్నారని నగరపాలక సంస్థ ఉద్యోగులే గుసగుసలాడుతున్నారు. గతంలో కమిషనర్‌గా వినయ్ చంద్ ఉన్న సమయంలో ఓ ఆపరేటర్ ఏకంగా కమిషనర్ లాగిన్, పాస్ వర్డ్‌తో పలు అక్రమాలు చేయడంతో కమిషనర్ స్వయంగా ఆ వ్యక్తిని సస్పెండ్ చేశారనేది అందరికీ తెలిసిన విషయమే. అయితే ఆ వ్యక్తి కొన్ని రోజుల్లోనే మరొక విభాగంలో చేరి, ఎవ్వరికి ఎక్కువగా కనిపించకుండా కొంత మంది అధికారులు అండగా కొన్ని రోజులు విధులు నిర్వహించాడని తెలుస్తోంది. ఇదే సమయంలో ఎవ్వరికి తెలియకుండా గృహ నిర్మాణ శాఖలో సైతం కొంత మంది లాగిన్, పాస్వర్డ్ తీసుకుని తమకు నచ్చిన వారికి, డబ్బులు ఇచ్చిన వారికి అక్రమంగా ఇండ్లు కేటాయించినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆ సమయంలో కమిషనర్‌గా వున్న గిరిషా విచారణ చేపట్టి కారకుడైన ఉద్యోగిని గట్టిగా మందలించడం జరిగిందని అంటున్నారు. ఇక ఎన్నికల విధుల్లో సైతం కంప్యూటర్ ఆపరేటర్లను సమన్వయ పరుస్తూ అందరి లాగిన్, పాస్ వర్డ్‌లు తన చేతిలో పెట్టుకుని హల్చల్ చేసినట్లు అంటున్నారు. ఇదే సమయంలో ఎన్నికల విధులకు ప్రభుత్వం ఇచ్చే నగదు పంపిణీలో కూడా పనిచేయని వారి పేర్లు పెట్టుకుని అక్రమాలకు పాల్పడ్డారని పలువురు ఆపరేటర్లు అంటున్నారు. ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అన్ని విభాగాల కంప్యూటర్ ఆపరేటర్లు బెదిరించడం, వారిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారని వాపోతున్నారు. ఆయా విభాగాల్లో ఉన్నతాధికారులకు సైతం ఫైల్స్ సిద్ధం చేయడం వంటివి చేస్తుండడంతో వారు తమ వద్ద పని చేస్తున్న ఆపరేటర్లనే మందలిస్తున్నారని అంటున్నారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు తమ ఉద్యోగాలు కాపాడుకుంటే చాలు అన్నట్లు ఉంటున్నారు. మరి కొత్తగా వచ్చిన కమిషనర్ లాగిన్, పాస్‌వర్డ్ విషయంలో ఈ మేరకు జాగ్రత్త పడతారో చూడాలని ఉద్యోగులు అంటున్నారు.

## ప్రజలు వైకాపా రాక్షస కౌగిలి నుంచి బయటపడాలి

– మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

భవిష్యత్తుతరాల కోసం ప్రజలు వైకాపా రాక్షస కౌగిలి నుంచి బయటపడాలని మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ కోరారు. ఆదివారం మిట్టపల్లి పంచా యతీలో గ్రామ పెద్దలు, యువత పలువురు తెదేపా లో చేరారు. ఈసందర్భంగా ఆయన వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలో వచ్చేది తెదేపా ప్రభుత్వమేనన్నారు. అందరూ కలసి ఆగిపోయిన గ్రామాల అభివృద్ధిని కలసికట్టుగా చేసుకుందామని కోరారు. పార్టీ కోసం పనిచేసేవారిని కులమతాలకు అతీతంగా ఆహ్వానిస్తామన్నారు. కార్యక్రమంలో యువత అధ్యక్షుడు సుబ్బు, బిసి సెల్ అధ్యక్షుడు మురళి, ప్రధాన కార్యదర్శి గోపి, నేతలు జయరాంనాయుడు, మంజునాథ్, లీలా వెంకటేష్, చలపతి, రఘుపతి, ఇమ్రాన్, కనకరాజ్, భూపతి, రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

## మంచి నీటి సమస్య తలెత్తకుండా పక్కా చర్యలు

–ఎంపిపి శ్యామల శివప్రకాష్ రాజు



**పాలసముద్రం, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:**

వేసవి కాలం ప్రారంభం కావడంతో మండల పరిధిలో ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తకుంగా పక్కాచర్యలు చేపట్టాలని ఎంపిపి శ్యామల శివప్రకాష్ రాజు అధికారులను ఆదేశించారు.ఎంపిడిఓ కార్యాలయంలో సోమవారం ఎంపిపి శ్యామల శివప్రకాష్ రాజు అధ్యక్షతన మండల సమావేశం జరిగింది.ఈ సమావేశంలో జెడ్పిటిసిలు ,సర్పంచులు మాట్లాడుతూ వేసవి కాలంలో జాగ్రత్తలు తీసుకోవాలని లేకుంటే నీటి సమస్య అధికంగా ఉంటుందన్నారు.నీటి సమస్యల తలెత్తకుండా ఇప్పటి నుండి చర్యలు తీసుకోవాలని కోరారు.కొంత మంది అధికారులు విధి నిర్వహనలో అలసత్యం వహిస్తున్నారని అలాంటి వారిపై చర్యలు తప్పవని ఎంపిపి హెచ్చరించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులందరికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా మండంలో జరిగిన అభివృద్ధి పనులను అధికారులు వివరించారు.

## జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో ప్రతిభ చూపిన విజేతలకు సన్మానం

**పాలసముద్రం,ఫిబ్రవరి 4,ప్రభాతవార్త:**



జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్ర కబడ్డీ పోటీలో పాల్గొని రెండవ స్థానం దక్కించుకున్న పాలసముద్రం పురుషుల జట్టును ఆదివారం ఎంపిడిఓ కార్యాలయంలో ఎంపిపి శ్యామల,జిల్లా వ్యవసాయ సలహా కమిటి సభ్యులు శివప్రకాష్‌రాజు,ఎంపిడిఓ రామనాథరెడ్డి,వైస్ ఎంపిపి శేకర్‌మండడి సన్మానించారు. ఈ సందర్భంగా శివప్రకాష్ రాజు మాట్లాడుతూ పాల సముద్రం కబడ్డీ జట్టు జిల్లా స్థాయి పోటీలకు చేరి ప్రతిభ కనపరచడం మండల ప్రజలందరికి సంతోషంగా ఉందన్నారు.కబడ్డీ జట్టు తరహాలోనే మిగిలిన క్రీడాకారులు తమ ప్రతిభను క్రీడలలో కనపరచి మండలానికి మంచి పేరు తీసుకురావాలని పిలుపునిచ్చారు.



## అడ్మిన్ ఏఎస్పీగా బాధ్యతలు చేపట్టిన ఆరీఫుల్లా

**చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:** చిత్తూరు జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా ఆరీఫుల్లా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. పోలీసు శాఖలో ఎస్ఐగా నియమితులైన ఆయన రాయలసీమ జిల్లాలోని పలుప్రాంతాలలో ఎస్ఐగా విధులు నిర్వహించారు. ఈ క్రమంలో ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి లభించడంతో ఆయన కర్నూలు, అనంతపురం జిల్లాలో పనిచేశారు. ఈ నేపథ్యంలోనే డిఎస్పీగా పదోన్నతి పొందిన ఆయన పలమనేరు డిఎస్పీగా విధులు నిర్వహిస్తూ అడిషినల్ ఎస్పీగా పదోన్నతి పొంది తిరుపతి జిల్లా ఓఎస్‌డిగా, వైజాగ్‌లో ట్రాఫిక్ డిసిపిగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం జరిగిన బదిలీలలో భాగంగా ఆయన చిత్తూరు జిల్లా అడ్మిన్ ఏఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన ఎస్పీ పి.జాషువాను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అదేవిధంగా అడ్మిన్ ఏఎస్పీ ఆరీఫుల్లాను పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

## డిఎస్పీగా రాజగోపాల్ రెడ్డి బాధ్యతల స్వీకరణ

**చిత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**



చిత్తూరు డిఎస్పీగా ఎం.రాజగోపాల్ రెడ్డి ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన డిఎస్పీల బదిలీలో భాగంగా చిత్తూరు డిఎస్పీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస మూర్తిని బదిలీ చేసిన ప్రభుత్వం ఆయన స్థానంలో డిఎస్పీగా ఎం.రాజ గోపాల్ రెడ్డి బదిలీపై వచ్చారు. కర్నూలు జిల్లా, రేవనూరు గ్రామానికి చెందిన ఆయన 1991 బ్యాచ్‌లో ఎస్ఐగా చేరారు. మొదటి పోస్టింగ్ చిత్తూరు జిల్లాకు కేటాయిం చడంతో జిల్లాలోని పలు ప్రాంతాలలో ఆయన ఎస్ఐ గా విధులు నిర్వహించారు. అనంతరం ఆయనకు ఇన్స్పెక్టర్‌గా పదోన్నతి లభించడంతో జిల్లాలోని కుప్పం, చిత్తూరు వెస్ట్ సర్కిల్, తిరుపతి జిల్లా, నెల్లూరు జిల్లాలో ఇన్స్పెక్టర్‌గా పనిచేశారు. డిఎస్పీ గా బాధ్యతలు చేపట్టిన ఆయన అనంతరం ఎస్పీ పి.జాషువాను మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు.

## రా..కదలిరా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

**తవణంపల్లె, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**



ఈనెల 6న మండల కేంద్రం గంగాధరనెల్లూరులో జరిగే రా...కదలిరా కార్యక్రమంను విజయవంతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక టీడీపీ పార్టీ కార్యాలయంలో శనివారం రా...కదలిరా కార్యక్రమం సనా హ్నహంపై మండల నాయకులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 6న గంగాధరనెల్లూరులో జరిగే రా...కదలిరా కార్యక్రమంలో టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరుకానున్నట్లు తెలిపారు. నియోజకవర్గ పరిశీలకులు బొమ్మన శ్రీధర్, మండల పార్టీ అధ్యక్షులు దిలీప్‌నాయుడు, ప్రధాన కార్యదర్శి మధుకుమార్ యాదవ్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్వర చౌదరి, క్లస్టర్ ఇన్‌చార్జిలు సునీల్ చౌదరి, మోహన్‌నాయుడు, నాయకులు గోపీయాదవ్, శరవణకుమార్, వెంకటస్వామిలతో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

**కాణిపాకంలో...**

**కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:**

గంగాధరనెల్లూరులో ఈనెల 6న జరుగునున్న రా...కదలిరా కార్యక్రమంను విజయవంతం చేయాలని టీడీపీ పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ మురళీమోహన్ మండలంలోని టీడీపీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. స్థానిక సాయి తేజా పంక్షన్‌హాల్‌లో రా...కదలిరా కార్యక్రమం విజయవంతంకు మండలంలోని టీడీపీ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమ పరిశీలకులు శ్రీనివాసరెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు గిరిధర్‌బాబు, కాణిపాకం ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావునాయకులునరసింహులునాయుడు,సతీష్‌లతోపాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## సిఎం జగన్ సిద్ధం సభను విజయవంతం చేయాలి

– ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్

**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



అనంతపురంలో ఈనెల 11వతేది జరిగే సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి సిద్ధం బహిరంగసభను విజయ వంతం చేయాలని ఎమ్మెల్సీ,జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన నేతలు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాయలసీమ జిల్లాల స్థాయికి సంబంధించి అనంతపురంలో సిఎం జగన్ సిద్ధం సభలో పాల్గొంటారన్నారు. కుప్పం నియోజకవర్గంలోని నాలుగు మండలాలనుంచి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు ఈసభకు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఇదివరకు జరిగిన సిద్ధం బహిరంగసభలకు జనం, కార్యకర్తలు జేజేలు పలుకుతున్నార న్నారు. అనంతపురంలో జరిగే సభకు జిల్లా నుంచి భారీ స్థాయిలో కార్యకర్తలు హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం సభకు వెళ్లేవారికోసం ఏర్పాటుచేయాల్సిన బస్సులు, వాహనాలు, ఆహారం తదితరాలపై చర్చించారు. అనంతరం సిద్ధం పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ ఛైర్మన్ డా॥ సుధీర్, రెండో వైస్ ఛైర్మన్ హఫీజ్, మండల కన్వీనర్లు హెచ్‌ఎం మురుగేష్, బాబురెడ్డి, దండపాణి, జడ్పీటిసిలు ఎడిఎస్ శరవణ, కృష్ణమూర్తి, నితిన్‌రెడ్డి, ఎంపిపి వరలక్ష్మి, ఎపిసిఎస్‌సి డైరెక్టర్ శ్రీనివాసమూర్తి, మురుగేష్ తదితరులు పాల్గొన్నారు.

## జంప్ జిలానీలు..!



మళ్లీ వైకాపా గూటికి మఠం సర్పంచ్.. ఎంపిటిసి !!

**కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో పార్టీల్లో జంప్ జిలానీల ఆటలు మొదలయ్యాయి. శనివారం శాంతి పురం మండలం మఠం పంచాయతీకి చెందిన వైకాపా సర్పంచ్ మురళి, ఎంపిటిసి చంద్రలు ఎమ్మె ల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం నాటికి సీన్ మళ్లీ మొదటి కొచ్చింది. ఆదివారం ఉదయం కల్లా తెదేపా కండువాలు వేసుకున్న సర్పంచ్ మురళి, ఎంపిటిసి చంద్రలు ఎమ్మెల్సీ భరత్ సమక్షంలో మరలా వైకాపా కండువాలు కప్పుకున్నారు. వీరి వాలకం చూసి విస్తుపోవడం ఇరుపార్టీల నేతలు, కార్యకర్తల వంతైంది.

## తెదేపా నేతలచే ఆర్థికసాయం

**రామకుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



మండలంలోని చిక్కపల్లి తాండాకు చెందిన మహిళా టిడిపి నేత సుమిత్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. ఆదివారం తెదేపా నేతలు ఆమె మృతదేహంకు నివాళులు అర్పించారు. పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు పదివేల సాయం అందించారు. కార్యక్రమంలో నేతలు ఆనందరెడ్డి, ఆంజనేయరెడ్డి, చలపతి, కృష్ణనాయక్, బాలాజీ నాయక్, చంద్రకళ, నందారెడ్డి, టివి రవి, జేయి, భూపతి, వెంకటేష్ పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## డిగ్రీ బాలికల కళాశాల ఏర్పాటుకు వినతి

**చౌడేపల్లి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



నియోజకవర్గంలో డిగ్రీ బాలికల కళాశాల ఏర్పాటు చేయాలని వైకాపా రాజంపేట, చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గాల యువజన అధ్యక్షుడు మిద్దింటి కిషోర్‌బాబు పార్లమెంట్ ప్రొటెం స్పీకర్, ఎంపి పెద్దిరెడ్డి వెంకటమిథున్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు ఆయన విజయవాడలోని ఎంపి గృహంలో కలిశారు. ఇంటర్ అయిన తర్వాత బాలికలు ఉన్నత విద్యకోసం ఇబ్బందులు పడుతున్నారనీ, పుంగనూరు నియోజకవర్గంలో కళాశాలను ఏర్పాటు చేయాలని కోరాననీ, ఎంపి సానుకూలంగా స్పందించారని మిద్దింటి తెలిపారు.



## పట్టణంలో చల్లా పర్యటన

**పుంగనూరు, ఫిబ్రవరి 3 ప్రభాతవార్త :**

తెలుగుదేశం పార్టీ నాయకుడు,చల్లా రామచంద్రారెడ్డి ఆదివారం నుంచి పుంగనూరు పట్టణంలో పర్యటనలు ప్రారంభించారు. ఆదివారం ఉదయం హనుమంతరాయదిన్నె గ్రామంలో స్వామివారి ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం పట్టణంలోని డిగ్రీకళాశాల వెనుక కాలనీ,బిడీ కాలనీ, తదితర ప్రాంతాలలో పర్యటించారు. ఈసందర్భంగా హనుమంతరాయదిన్నె గ్రామంలో ఆయన అధ్వర్యంలో పలువురు వైకాపా కార్యకర్తలు తెలుగుదేశం పార్టీలో చేరారు. చల్లా బాబు పర్యటన సందర్భంగా పలు కాలనీలలో ప్రజలు ఆయనకు పెద్దఎత్తున స్వాగతం పలికారు.తెలుగుదేశం నాయకుడు సామాజిక వేత్త సయ్యద్‌సుహేల్‌బాషాతో పాటూ,న్యాయవాది వెంకటముని, జనసేన నాయకులు పగడాల రమణ, విరూపాక్షి, దేశం నాయకులు కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొన్నారు. జనసేన పార్టీనాయకులు,కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## తల్లిలాంటి కాంగ్రెస్‌పై విమర్శలు తగునా ...

– డీసీసీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్



**వెదురుకుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :**

కాంగ్రెస్ శవాన్ని మోస్తున్న ఆ నలుగురు అన్న మంత్రి పెద్ది రెడ్డి రామచంద్రా రెడ్డి వ్యాఖ్యలు అక్షేపణీయమని చిత్తూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోటుగారి భాస్కర్ ఒక ప్రకటనలో తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పెద్దిరెడ్డి లాంటి ఎంతో మందికి రాజకీయభిక్ష పెట్టింది కాంగ్రెస్ అని ఆయన గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీలోఎన్నో ఉన్నత పదవులు అలంకరించి ఈ రోజు షర్మిల రెడ్డి కాంగ్రెస్ పార్టీలె చేరికను జీర్ణించుకోలేక మతిభ్రమించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. పెద్ది రెడ్డి కాంగ్రెస్ పార్టీ పై చేసిన విమర్శలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. షర్మిల రెడ్డి అడిగే సూటి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఇలాంటి విమర్శలు చేస్తున్నారని ఇకనైన వాస్తవాలు తెలుసుకుని బేషరతుగా కాంగ్రెస్ పార్టీకి క్షమాపణ చెప్పాలన్నారు.

## గంగవరం అర్బన్ సిఐగా చిన్నగోవిందు

**గంగవరం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త :**



గంగవరం అర్బన్ సిఐగా టి.చిన్నగోవిందు ఆదివారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించారు.ప్రభుత్వం ఇటీవల ఎస్ఐ స్థాయి నుండి ఇన్స్‌స్పెక్టర్ స్థాయికి అప్‌గ్రేడ్ చేసింది.దీంతో గంగవరం మొట్టమొదటి అర్బన్ సిఐగా చిన్నగోవిందు బాధ్యతలు చేపట్టారు.ఈయన అనంతపురం జిల్లా దిశా మహిళా పోలీస్‌స్టేషన్ నుండి గంగవరంకు వచ్చారు.చిన్నగోవిందు గతంలో గంవగవరం ఎస్ఐగా విధులు నిర్వహించి ప్రజల్లో ఆయనకు మంచి పేరు ఉంది.ఉన్నతాధికారుల ఆదేశాలు పాటిస్తూ, ఎన్నికల విధుల్లో నిష్పాక్షపాతంగా వ్యవహరించి,ప్రోటోకాల్‌కు భంగం వాటిల్లకుండా, నేరాల నియంత్రణకు,ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించి,శాంతిభద్రతలను పరిరక్షిస్తామన్నారు. పోలీసులు ప్రజల మన్నలను పొందేలా అంకితభావంతో,చిత్తశుద్ధితో విధులు నిర్వహించాలని ఆయన కోరారు.

## హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

**కుప్పంరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



మున్సిపల్ పరిధి డికెపల్లి మోడల్ కాలనీలో తెదేపా నేతలచే నిర్వహిస్తున్న ఎన్టీఆర్ స్మారక వాలీబాల్ టోర్నీ హోరాహోరీగా సాగుతోంది. ఆదివారం రాత్రి సైతం ఫ్లడ్‌లైట్ల వెలుగులో జట్లు తలపడ్డాయి. రాత్రి తొమ్మిదిగంటలకు ఫైనల్స్ జరిగాయి. వివిధ ప్రాంతాలనుంచి వచ్చిన జట్లు ఈ పోటీల్లో ఉత్సాహం పాల్గొన్నాయి. కార్యక్రమంలో ఆర్గనైజర్లు గనీఉల్లా, నబీఉల్లా తదితరులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## తహశీల్దార్ రమణయ్య హత్య పట్ల దిగ్భ్రాంతి

**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

విశాఖపట్నం జిల్లాలో తహశీల్దార్ రమణయ్యను హత్య చేయడం బాధాకరమని గూడూరు డివిజన్ రెవెన్యూ అసోసియేషన్ అధ్యక్షులు మల్లికార్జునరావు ఖండించారు. ఆదివారం ఆయన కోటలో విలేఖరులతో మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులపై దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రత్యేక చట్టం తీసుకురావాలని ఆయన డిమాండ్ చేశారు. తహశీల్దార్ రమణయ్య హత్యను తీవ్రంగా ఖండిస్తున్నామని, హత్యకు కారకులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షపడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తహశీల్దార్ రమణయ్య కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని కోరారు.

## రైలు ప్రమాదంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి

**తడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



తడ రైల్వేస్టేషన్ వద్ద శనివారం రాత్రి రైలు నుంచి దిగుతూ ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసుల కథనం మేరకు, చెన్నై సెంట్రల్ నుంచి సూళ్లూరుపేటకు వెళ్లే సబర్బన్ రైలులో తడ వరకు వచ్చి అక్కడ దిగుతూ ప్రమాదవశాత్తు పడిపోయాడు. రైల్వే సిబ్బంది హుటాహుటిన 108 వాహనంలో సూళ్లూరుపేట ప్రభుత్వాసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. రైల్వే ఎస్ఐ కె.కొండప్పనాయుడు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ గుర్తుతెలియని వ్యక్తి ఆకుపచ్చరంగు నిలువు గీతల చొక్కా, నీలంరంగు పెద్ద గళ్లగుంగీ కట్టుకొని ఉన్నాడని, శనివారం సాయంత్రం తమిళనాడులోని అత్తిపట్టు నుంచి సూళ్లూరుపేట వరకు టికెట్ తీసుకొని ప్రయాణిస్తూ ప్రమాదానికి గురైనట్లు తెలిపారు.

## బలహీన వర్గాలకు అన్నీ చేసింది టిడిపియే

– తడలో జయహో బిసి కార్యక్రమం



**తడ, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

తెలుగుదేశం పార్టీ బలహీన వర్గాలకు అన్ని రంగాల్లోను సాయం అందించిందని, బిసిల ఎదుగుదలకు ఎన్‌టిఆర్, చంద్రబాబునాయుడులు ఎంతో కృషి చేశారని తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు నరసింహ యాదవ్ పేర్కొన్నారు. సూళ్లూరుపేట అసెంబ్లీ నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఆదివారం తడలో జయహో బిసి కార్యక్రమం నిర్వహించారు. మత్స్యకారులు, పల్లెకాపులు ఎక్కువగా ఉన్న తడ ప్రాంతంలో ఈ కార్యక్రమానికి బిసిలు పెద్దసంఖ్యలో విచ్చేశారు. నరసింహయాదవ్‌తో పాటు నెలవల సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ రాజకీయంగాను బిసిలకు వివిధ కీలక పదవులు కట్టబెట్టిన ఘనత మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదని కొనియాడారు. తడ ప్రాంతంలోని బిసిలు అందరు ఐకమత్యంతో పనిచేసి రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అధికారాన్ని కట్టబెట్టాలని వీరు కోరారు. టిడిపి జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి బొమ్మన్ శ్రీధర్, బిసి జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు రుద్రకోట సదాశివం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి మునుస్వామి, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, రాష్ట్ర బిసి కార్యదర్శి టికె శ్రీనివాసన్, రాష్ట్ర బిసి సాధికార సమితి నాయకుడు బొమ్మన్ పళణి, తెలుగు మహిళా నాయకులు బి.గుణసుందరి, వి.కల్యాణి, కొళవి సెల్వం, ఎం.సుదర్శనరావు, తెలుగు యువత రవి తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి మండల పార్టీ అధ్యక్షుడు, మండల టిడిపి బిసి కమిటీ అధ్యక్షుడు, పలువురు బిసి నేతలు హాజరు కాకపోవడం విశేషం. తెలుగుదేశం పార్టీలో ఇటీవల నెలకొన్న కొన్ని వివాదాల నేపథ్యంలో ఒక వర్గం వారు జయహో బిసి సదస్సుకు హాజరు కాలేదు.

## ఎన్‌జేఆర్ విగ్రహం ప్రతిష్టకు స్థల పరిశీలన



**నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి**

**వాకాడు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

వాకాడులోని స్వర్ణముఖి బ్యారేజీ సమీపంలో రాష్ట్ర కమ్యూనిటీ డెవలప్మెంట్ బోర్డ్ ఛైర్మన్, తిరుపతి జిల్లా అధ్యక్షులు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి తండ్రి దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ నేదురుమల్లి జనార్దన్ రెడ్డి విగ్రహం పెట్టేందుకు స్థల పరిశీలించారు. ఆదివారం రాంకుమార్ రెడ్డి బ్యారేజ్ ముందు ఉన్న స్థలంను ఇంజనీరింగ్ సిబ్బందితో, స్థానిక నేతలతో ఆ స్థలంను క్షుణ్ణంగా పరిశీలించి, రానున్న రోజుల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులతో ముందు జాగ్రత్తలు తీసుకున్నారు. అదే విధంగా మరెన్నోచోట్ల కూడా తన తండ్రి జనార్దన్ రెడ్డి విగ్రహ ఏర్పాటుకు స్థలం పరిశీలనలో ఉందన్నారు. త్వరితగతిన తన తండ్రి విగ్రహం ప్రతిష్టకు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి భారీ స్థాయిలో ఉంటుందన్నారు. ఆయన వెంట వాకాడు సబ్ ఇన్స్పెక్టర్ పవన్, వాకాడు సొసైటీ ఛైర్మన్ దామోదర్ రెడ్డి, వాకాడు ఉప సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి , వాకాటి రవికుమార్, గూడూరు సుధాకర్ రెడ్డి, ఇంజనీరింగ్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు

**సూళ్లూరుపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



సూళ్లూరుపేట పట్టణంలో అస్తవ్యస్థంగా ఉన్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు పోలీసులు శ్రీకారంచుట్టారు. ఆదివారం రద్దీగా ఉండే కచ్చేరి వీధి, బాపూజీ వీధి ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ కోట రహీంరెడ్డి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన రోడ్డు మార్జిన్‌లో ఉన్న వ్యాపారులను ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. మోటారు బైక్‌లు, ఇతర వాహనాలు క్రమపద్ధతిలో పెట్టుకొని విక్రయాలు కొనసాగించాలన్నారు. పట్టణంలో నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ రహీమ్‌రెడ్డి ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

## రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్‌చే ఆర్థికసాయం

**చిల్లకూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



ప్రమాదవశాత్తు రాయిపై పడి తలలో రక్తం గడ్డ కట్టి హాస్పిటల్ ఐసియూలో ఉన్న పేద వ్యక్తి వైద్యం కోసం 25 వేల రూపాయిలను చిల్లకూరు మండలంలోని చేడిమాల గ్రామంలో ఏర్పాటై ఉన్న రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు రాజనేని శ్రీనివాసులు నాయుడు అందజేసారు. తిరుపతి జిల్లా దొరవారిసత్రం మండలం తనియాలి గ్రామానికి చెందిన మొండెం మునిరాజ (34) అనే వ్యక్తి పదిరోజుల క్రితం కూలీ పని చేసుకుని ఇంటికి తిరిగి వస్తుండగా ప్రమాదవశాత్తు రాయిపై పడడంతో తలకి బలమైన గాయమై ఆ భాగంలో రక్తం గడ్డకట్టింది. అప్పటి నుంచి నెల్లూరులో ఎనల్ హాస్పిటల్‌లో వైద్యం అందిస్తున్నారు. పేదవారు కావడంతో రాజనేని రమణానాయుడు చారిటబుల్ ట్రస్టును ఆశ్రయించారు. వెంటనే స్పందించిన ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు ట్రస్టు సభ్యులైన బాబు,భాస్కర్లద్వారాహాస్పిటల్‌లోఉన్నబాధితుడు భార్య మల్లేశ్వరికి 25 వేల రూపాయిలను అందజేసారు.

## సిపిఎం పార్టీ విరాళాలు సేకరణ

**గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని సుందరయ్య కాలనీలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో విరివిగా విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ నిత్యం సామాన్య ప్రజల బాగు కోసం, రాష్ట్రాభివృద్ధి కోసం నిజాయితీగా, నిస్వార్థంగా పాటుపడుతున్న పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని పేర్కొన్నారు. ఆదర్శ నేత పుచ్చలపల్లి సుందరయ్య ఆనాడు వేసిన బాటలో ముందుకు సాగుతూ సమాజంలో పేదరికం పోయి, కష్టజీవి సుఖశాంతులతో జీవించాలని, రాష్ట్రం అభివృద్ధి మార్గంలో ముందుకు సాగాలని సిపిఎం అనునిత్యం కృషి చేస్తుందన్నారు. ఇది ప్రజల పార్టీ ఈ పార్టీని నడిపించాల్సిందన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించి పార్టీలో భాగస్వామ్యం కావాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు బివి రమణయ్య, సురేష్, వెంకటరామిరెడ్డి, చంద్రయ్య, పుట్టా శంకరయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఓజిలి ఎస్ఐగా రవిబాబు బాధ్యతలు స్వీకరణ

**ఓజిలి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**



ఓజిలి పోలీసుస్టేషన్ ఎస్ఐగా రవిబాబు ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతతో విధులు నిర్వహిస్తూ పోలీసుస్టేషన్‌కు వచ్చే వారితో ఫ్రెండ్లీ పోలీసింగ్ నిర్వహించి చట్టపరంగా అవసరమైన రక్షణ చర్యలు చేపడతానని తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తూ క్రైమ్ రేట్ తగ్గిస్తానని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నిఘా వ్యవస్థను మరింత కట్టుదిట్టంగా అమలు చేస్తానని తెలిపారు.

## నాయకులు, కార్యకర్తలకు అండగా ఉంటా

మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

**బాలాయపల్లి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** మండలంలోని వెంకగమాంబపురం గ్రామానికి చెందిన టిడిపి నాయకుడు కొల్లపనేని కృష్ణమనాయుడు మృతి చెందడంతో భౌతికకాయానికి పూలమాలలు వేసి మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా నివాళులు అర్పించారు. నివాళులు అర్పించిన వారిలో మాజీ వ్యవసాయ మార్కెట్ ఛైర్మన్ సిసి నాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్, పంచాయితీ అధ్యక్షులు దామామధు, నాయకులు కాపా శ్రీనివాసులు, శ్రీహరి నాయుడు తదితరులు ఉన్నారు.

## విధులు నిష్పక్షపాతంగా నిర్వహించాలి

ఎస్ఐలకు రాంకుమార్ రెడ్డి సూచన



**వెంకటగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

నిష్పక్షపాతంగా విధులు నిర్వహించాలని వైసిపి తిరుపతి జిల్లా అధ్యక్షులు నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎస్ఐలకు సూచించారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన డక్కిలి, బాలాయపల్లి ఎస్ఐలు చౌదయ్య, సుభాన్లు రాంకుమార్ రెడ్డినిమర్యాదపూర్వకంగాకలిసిపుష్పగుచ్ఛాలను అందజేసారు. విధులనుసమర్థవంతంగానిర్వహించాలనిఆయనఎస్ఐలకుసూచించారు.

## వైఎస్ఆర్ పార్టీ అండగా ఉంటుంది

ఏపిఏ ఉపాధ్యక్షులు వి. సర్వజ్ఞ కుమార యాచేంద్ర

**వెంకటగిరి, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సేవ చేసి ఇబ్బందుల్లో ఉన్న వారిని పార్టీ అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఏపిఏ ఉపాధ్యక్షులు వైసిపి నేత వి. సర్వజ్ఞ కుమార యాచేంద్ర తెలిపారు. ఇటీవల అనారోగ్యానికి గురైన మల్లమ్మ దేవాలయంకు చెందిన పార్టీ నాయకుడు కాటాబత్తిన చిరంజీవిని పరామర్శించి ఆయన ఆరోగ్య స్థితిగతులను తెలుసుకుని కొంత మొత్తం ఆర్థిక సహాయం అందజేసారు. అలాగే ఇటీవల మోకాలు శస్త్రచికిత్స చేయించుకున్న చింతగుంట సర్పంచ్ తండ్రి కాలే చెంచు నరసింహరావును కూడా పరామర్శించారు. మనురాలపేటలో సప్రం కాలప్పని కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట పట్టణ కన్వీనర్ ఢిల్లీ బాబు, కౌన్సిలర్ ఎంప నారాయణ, మాజీ కౌన్సిలర్ చిన్న తదితరులు ఉన్నారు.

## భారీగా వైసిపి నుండి టిడిపిలో చేరికలు

**చిల్లకూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**



చిల్లకూరు మండలం ఎన్ఆర్ పల్లి గ్రామం నుండి వైసిపికి చెందిన 100 కుటుంబాల వారిని మహాజన సైన్యం అధ్యక్షులు చేవూరు సురేంద్ర ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పి పార్టీలోకి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ ఆహ్వానించారు. గ్రామం నుండి 8వ వార్డు మెంబర్ చీపినేటి అన్వేష్, 11వ వార్డు సభ్యులు బాలిపాక ధనంజయ, అద్దంకి పెంచలయ్య, బాలిపాక దసయ్య, గుండాల సుధీర్, సులూరు చెంగయ్య, పిచ్చుక శ్రీనివాసులు, సుకుమార్, తల్లు సుబ్బారావు, పోలిచర్ల పరుశురాం, కంటేపల్లి ఏడుకొండలు తదితరులను కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ నాయకులు ఆబాక రమణా రెడ్డి, పుచ్చలపల్లి జనార్దన్‌రెడ్డి,తంబయ్య,చాట్లరవి,నాయకులుజిల్లాఅధికారప్రతినిధిబిల్లు చెంచురామయ్య,మైనారిటీఅధ్యక్షులుఎండి అబ్దుల్ రహీమ్, నెలటూరు చిరంజీవి, యల్లసరి నాగార్జున పాల్గొన్నారు.

## కోట తహశీల్దార్‌గా నాగరాజరావు

**కోట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త**

కోట మండల తహశీల్దార్‌గా నాగరాజరావు బదిలీపై రానున్నారు. ఇక్కడ పనిచేస్తున్న తహశీల్దార్ పద్మావతి ప్రకాశం జిల్లా పిసిపల్లి మండలానికి బదిలీపై వెళ్లారు. కోట తహశీల్దార్‌గా గుంటూరు జిల్లా వేమూరు మండల తహశీల్దార్ నాగరాజరావు వస్తున్నారు. ఎన్నికల నేపథ్యంలో తహశీల్దార్లను ప్రభుత్వం బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కోట మండల నూతన తహశీల్దార్ నాగరాజరావు సోమవారం బాధ్యతలు స్వీకరిస్తారని ఇన్‌ఛార్జ్ తహశీల్దార్ మల్లికార్జునరావు తెలిపారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎమ్మెల్యే వెలగపల్లి వరప్రసాద్ రావు

**గూడూరు, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త**

ప్రతి ఒక్కరు ఆరోగ్యంగా ఉండేందుకు యోగాసనాలు, వాకింగ్ వంటివి చేయాలని ఎమ్మెల్యే వరప్రసాద్ రావు సూచించారు. గూడూరు పట్టణంలోని అల్లూరు ఆదిశేషారెడ్డి ప్రభుత్వ స్టేడియంలో వాకర్స్ అసోసియేషన్, క్రీడాకారుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావును సన్మానించారు. స్టేడియం అభివృద్ధికి ఆయన కృషి చేయడంతో అలాగే అమరావతి ఆసుపత్రుల అధినేత డాక్టర్ రమణయ్య సతీమణి నిర్మల సహకారంతో యోగాసనాలు చేసేందుకు అవసరమయ్యే యోగా మ్యాట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. ప్రతి రోజూ యోగా, వాకింగ్ వంటివి చేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్టేడియం అభివృద్ధికి, క్రీడాకారులకు తన వంతు చేయూత అందించానని ఆయన వివరించారు. ఇంకా మరికొందరు మాట్లాడురు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతి నిధులు వేగూరు రాజేంద్ర ప్రసాద్, మునిగిరీష్, నాగేశ్వర రావు, సుబ్రమణ్యం, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ప్రాథమిక దశలో గుర్తిస్తే క్యాన్సర్‌ను అరికట్టవచ్చు..!

క్యాన్సర్ కారకాలపై అవగాహన అవసరం
ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్

చంద్రగిరి, ఫిబ్రవరి, 4 ప్రభాతవార్త:



ప్రాథమిక దశలోనే క్యాన్సర్‌ను గుర్తించగలిగితే అరికట్టవచ్చునని ఎస్వీ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు. స్థానిక ఆర్‌హెచ్‌టిసిలో ఆదివారం ఎస్వీ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత అధ్యక్షతన ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యాన్సర్ రావడానికి గల కారణాలను తెలుసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమన్నారు. క్యాన్సర్ లక్షణాలు నోటి పుండ్లు, నోటిలో గడ్డ, ఆహారం తీసుకోవడంలో గొంతు నొప్పి, నెలసరిలో అధిక స్రావం, నొప్పి, మల, మూత్రవిసర్జనలో మార్పులు, వక్షోజాలలో గడ్డలు, చనుమొనల నుండి రక్తస్రావం, చర్మంపై మచ్చలు, ఆకస్మికంగా చర్మం రంగు మారడం వంటివి వుంటాయన్నారు. తొలిదశలోనే ప్రాథమిక పరీక్షలు చేయించుకున్నట్లయితే క్యాన్సర్ దశనుబట్టి చికిత్సలు అందించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ శశికళ, డాక్టర్ విజయ్‌కుమార్, డాక్టర్ రోజారమణి, డాక్టర్ స్వప్న, డాక్టర్ సునీత, డాక్టర్ యు.ప్రసాద్, డాక్టర్ మధుసూదన్, డాక్టర్ వశీమ్ అక్రమ్, డాక్టర్ రేవతి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రగతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం

తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రగతే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వాన్ని నడుపుతున్నట్లు తుడా చైర్మన్, ఎంఎల్‌ఏ అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి తెలిపారు. మండల పరిధిలోని కొటాల, చిన్నరామాపురం, కందులవారిపల్లి, ఏ.రంగంపేట పంచాయతీలలో ఆదివారం "ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే " కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాటత ప్పని మడమ తిప్పని నాయకుడుగా జగనన్న ఎన్నికల హామీలలో 99 శాతం నెరవేర్చారని అన్నారు. ప్రతి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలను అందించారనీ, ఆరోగ్య శ్రీ పథకాన్ని రూ.25 లక్షలకు పెంచారన్నారు. అభివృద్ధికి ఆదర్శం కందులవారిపల్లి అన్నారు. నియోజకవర్గ ప్రజలే తన కుటుంబంగా ఎంఎల్‌ఏ చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పరిమితికి మించి సేవ చేస్తున్నట్లు తెలిపారు. ఆయన స్ఫూర్తితో రాజకీయ ప్రవేశంచేసినతానుచెవిరెడ్డికుమారుడిగా,వారసుడిగాచెప్పుకోవడంగర్వంగావుందన్నారు.2024 ఎనిక్నకలలో ఎంఎల్‌ఏ అభ్యర్థిగా మీ ముందుకు వస్తున్నట్లు తెలిపిన ఆయన ఆధరించి, ఆశీర్వదించాలని కోరారు.

## ఆరు పథకాలతో సామాజికాభివృద్ధే తెలుగుదేశం లక్ష్యం

సుధీర్‌రెడ్డిని గెలిపించండి:

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని 35 సంవత్సరాల పాటు పరిపాలించిన గోపాలకృష్ణారెడ్డి గ్రామీణాభి వృద్ధియే లక్ష్యంగా పరిపాలించారని కానీ నేడు ఆ వాతావరణం లేదన్నారు. పచ్చటి పొలాలను కూడా రియల్ ఎస్టేట్లుగా మార్చి సొమ్ములు చేసుకుంటు న్నారని బొజ్జల రిషితారెడ్డి ధ్వజమెత్తారు. ఆదివారం ఆమె తెలుగుదేశం నాయకులతో కలసి మద్దిలేడు.జింగిలిపాళెంలలో విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా ఆమె గ్రామాల్లో ప్రజల్ని చైతన్యవంతుల్ని చేస్తూ ఐదేళ్ళ పరిపాలనలో గ్రామీణాభివృద్ధి 50 సంవత్సరాలు వెనక్కు వెళ్ళిందని ఆమె ధ్వజమెత్తారు. జగనన్న పాలనలో సర్పంచ్‌లు దిష్టిబొమ్మలు కాగా పోలీసు కేసులతో భయపెట్టి స్థానిక నాయకుడు ఏకగ్రీవాలంటూ వ్యాపారం చేసుకున్నారని ధ్వజమెత్తారు.గతంలో శాసనసభ్యుడుగా గంగిసుబ్బరామిరెడ్డి,మండల పరిషత్ అధ్యక్షుడుగా బొజ్జల హరినాథ్‌రెడ్డి, 35 సంవత్సరాల పాటు గోపాలకృష్ణారెడ్డి సామాజికాభివృద్ధియే లక్ష్యంగా పరిపాలించారు తప్ప కక్షసాధింపు పాలన సాగించలేదన్నారు.నేడు వాస్తవం మాట్లాడితే పోలీసు కేసులతో భయభ్రాంతుల్ని చేస్తూ పరిపాలించారని పోలీసుల రాజ్యం కావాలో? ప్రశాంత పాలన కావాలో? ప్రజలు తేల్చుకునే రోజు దగ్గరపడిందిదన్నారు.ఈ కార్యక్రమాల్లో క్లస్టర్ ఇన్‌చార్జి బత్తిరెడ్డి, యూనిట్ ఇంచార్జి బత్తెయ్య, జగదీష్‌రెడ్డి, రవీంద్రరెడ్డి, సుభాషిణి, రామచంద్రయ్య, ధన్‌పాల్ రెడ్డి, బత్తెయ్య, వెంకటమునిి, రఘురామిరెడ్డి, పెంచల రెడ్డి, రాజయ్య, వెంకటేష్, ఈశ్వర్, గురవయ్య, యచేంద్ర, రాధాకృష్ణయ్య, సోమశేఖర్ యాదవ్, జంగం గురవయ్య, మునిరాజా, మునెయ్య, కేశవులు, శ్రీనివాసులు,రమణయ్య, మనోహర్‌రెడ్డి, వవెంకటసుబ్రమణ్యం, చిన్నబాటయ్య తదితరులు పాల్గొన్నారు.

## అవినీతి అక్రమ పాలన కావాలా? సుపరిపాలన కావాలా?

జనసేన

శ్రీకాళహస్తిరూరల్,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తి ప్రజలకు అవినీతి అక్రమాల, దౌర్జన్యాల పాలన కావాలా? ప్రశాంతమైన సుపరిపా లన కావాలా? ప్రజలు తేల్చుకునే రోజులు దగ్గర పడ్డాయని రాబోవు ఎన్నికల్లో ప్రజలకు వెన్నుదన్నుగా నిలిచే జనసేన నాయకుడు పవన్‌కళ్యాణ్ మద్దతు ఇచ్చే పార్టీలకు మద్దతుగా నిలవాలని శ్రీకాళహస్తి ఇన్‌చార్జి వినూత కోట పిలుపు నిచ్చారు.మండల నాయకుడు దండి రాఘవయ్య అధ్యక్షతన ముచ్చివోలులో ఏర్పాటు చేసిన కార్యక్రమాలకు హాజరైన వినూతను భారీ ఎత్తున స్వాగతం పలికారు. రాష్ట్రానికి పవన్ కళ్యాణ్ ఆయన ఆశయాల అవసరాన్ని వివరిస్తూ ఇంటింటికి వెళ్ళి ప్రచారం చేసారు. నాలుగేళ్ళలో రాష్ట్రంలో జగనన్న,శ్రీకాళహస్తిలో మధన్నలు ఎక్కడ ప్రభుత్వ భూములున్నా భూమాయ చేస్తూ తమ ఆస్తులను పెంచుకుంటూ నిరుపేదలను ఇంకా లేనివాళ్ళు చేస్తున్నారని ఈ ప్రమాదాన్ని గుర్తిం చాలని వినూత పిలుపు నిచ్చారు.ఈ కార్యక్రమాల్లో దండి రాఘవయ్య, నాయకులు కవిత, వెంకట సుబ్బయ్య,భరత్‌కుమార్,తోటగణేష్,శివకుమార్,కిరణ్‌కుమార్, పేట చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## పోషకాహారంపై తల్లిదండ్రులకు అవగాహన

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



శ్రీకాళహస్తిలోని భాష్యం పాఠశాలలో ఆదివారం తల్లిదండ్రులకు పోషకాహారంపై అవగాహన సదస్సు ను నిర్వహించారు. పాఠశాల మేనేజ్‌మెంట్ విద్యార్థు లకు ఎలాంటి ఆహారాన్ని అందించాలనే అంశంపై ప్రత్యేక సెమినార్ ఏర్పాటు చేసారు. తల్లిదండ్రులకు ఉల్లాసంగా వివిధ ఆటల పోటీలను నిర్వహించి ఉత్తేజ పరచారు.ముఖ్యఅతిధులుగా ఫిట్నెస్ ట్రైనర్ శ్రీ హర్ష, న్యూట్రీషియన్ లక్ష్మీసౌజన్యలు హాజరయ్యా రు.వారు వివరిస్తూ పిల్లలకు ఇష్టమైన కూరగాయాలతో కూరలు చేయటం ద్వారా,డ్రైఫ్రూట్స్ అందించటం వల్ల వాళ్ళకు కావాల్సిన పోషకాలు అందుతాయని వాళ్ళు ఇష్టపడి తింటారని వివరించారు. ప్రతి రోజూ ఓ గంట పాటు వ్యాయామం చేస్తే పిట్నెస్‌తో ఆరోగ్యంగా ఉంటారని భావిస్తున్నారు.ఈ కార్యక్రమాల్లో ప్రిన్సిపల్ హర్షవర్ధన్‌రెడ్డి,జెడిఓ లక్ష్మణ్, ప్రదానోపాధ్యాయులు నిరూష ఉపాధ్యాయులుతల్లిదండ్రులు పాల్గాన్నారు.ఈ సందర్భంగా ఏరోబిక్స్,యోగా,క్యాలసనిక్స్‌ను నేర్పించారు.

## కత్తి పద్మారావుపై ఫిర్యాదు

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



హిందూ ధర్మంపై అత్యంత నీచంగా మాట్లాడినటువంటి కత్తి పద్మారావుపై ఆదివారం తిరుపతి జిల్లా హిందూ ఉపాధ్యాయ సమితి శ్రీకాళహస్తి వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేసారు.ఈ సందర్భంగా సమితి తిరుపతి జిల్లా సమావేశం పట్టణంలోని వివేకానంద ఉన్నత పాఠశాలలో రాష్ట్ర సమితి ఉపాధ్యక్షుడు ఆదూరు శంకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది.జాతీయ అధ్యక్షులు మహేష్ ముఖ్యఅతిధిగా హాజరై పలు అంశాలకు సంబంధించి చర్చించారు. హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర ఎస్‌సి,ఎస్‌టి రిజర్వేషన్ పరిరక్షణ విభాగం అధ్యక్షులుగా ఎం,సుబ్రమణ్యంను ఏక గ్రీవంగా ఎన్నుకున్నారు. తిరుపతిజిల్లా గౌరవ అధ్యక్షులుగా ఎం.బాలాజిప్రసాద్,అధ్యక్షులుగా నూతల పాటి శేషగిరిరావుశర్మ, ప్రధాన కార్యదర్శిగా ఎం.పురుషోత్తం ఉపాధ్యక్షులుగా మస్తానమ్మలను ఎన్నుకున్నారు. మొదటి తీర్మానంగా గుంటూరులో కత్తిపద్మారావు వ్యాఖ్యలపై పోలీసులకు పిర్యాదు చేసారు.

## శివయ్య సన్నిధిలో ఎన్‌విఎస్‌ఎన్‌మూర్తి

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



దక్షిణకాశీగా పేరుగాంచిన శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానానికి దేవాదాయశాఖ తిరుపతి రీజనల్ జాయింట్ కమిషనర్ మల్టీజోన్ కమిషనర్ ఎన్‌విఎస్‌ఎన్‌మూర్తి కుటుంబ సభ్యులతో ఆలయానికి విచ్చేశారు. వీరికి ఆలయ డిప్యూటీ ఈవో వెంకటసుబ్బయ్య స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. ఆలయంలో వెలసిన స్వామిఅమ్మవార్ల దర్శనంతోపాటు పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం వీరికి గురుదక్షిణామూర్తి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందించి శేషవస్త్రాలు అందించి తీర్థప్రసాదాలను అందిం చారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో పిఆర్‌ఓ రవి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ సుదర్శన్ మరియు ఆలయాధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## శంకర్ నేత్రాలయ హాస్పిటల్ వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరం

**వరదయ్యపాలెం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త** వరదయ్యపాలెం మండలంలోని గోవర్ధనపురం ప్రభుత్వ పాఠశాల ఆవరణంలో డైనమిక్ ఫౌండేషన్ ఆద్వర్యంలో నిర్వహించిన నేత్ర వైద్య శిభిరంకు సుమారు 70 మంది ప్రజలు పాల్గొని చికిత్స చేయించుకున్నారు. అందులో 25 మంది ఉచిత కంటి ఆపరేషన్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా డైనమిక్ అధ్యక్షులు తొండమనాటి నాగప్రసాద్ మాట్లాడుతూ ప్రతినెల మొదటి ఆదివారం పేద ప్రజలు కోసం ఈ నేత్ర చికిత్స శిభిరాన్ని డైనమిక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని తెలియజేసారు. చెన్నై శంకర్ నేత్రాలయ వైద్య బృందం వారు ఆపరేషన్‌కు అర్హత కలిగిన వారికి పూర్తి పరీక్షలు నిర్వహించి, ఆపరేషన్ చేసిన తర్వాత తిరిగి వారిని వరదయ్యపాలెం చేరుస్తారనీ చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో పిఆర్‌ఓ వెంకటముని, డాక్టర్ అరవింద్ ముఖ్య అతిధి హెడ్మాస్టర్ పిఎం సుబ్రమణ్యం, స్వచ్ఛత్ మావూడూరి మోహన్ డైనమిక్ ప్రతినిధులు రామసుబ్బయ్య, గుణవర్ధన్, మోహన్ రావు, గోపి, సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

## సైదమ్మకు సేవారత్న అవార్డు



ఏర్పేడు,ఫిబ్రవరి 4, ప్రభాతవార్త;

మండలంలోని వికృతమాల గ్రామంలో శ్రీలక్ష్మీనరసింహ చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకురాలు సైదమ్మకు ఆదివారం సర్ సీవి రామన్ అకాడమీ వారు ఆమే వృదుదలకు, వికలాంగులకు చేస్తున్న సేవలకు గుర్తింపుగా ఈ అవార్డును ప్రధానం చేసినట్లు ఆమె పేర్కొన్నారు

## ఎంపీటీసీ వైసీపీ పార్టీకి రాజీనామా

పుత్తూరురూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



పరమేశ్వర మంగళంకు ఎంపీటీసీ శ్రీజ వైసీపీ పార్టీకి రాజీనామా చేశారు. ఆదివారం విజయవాడ తెలుగు దేశం పార్టీ ఆఫీస్‌లో పార్టీ అధ్యక్షుడు శ్రీ కింజరపు అచ్చెన్నాయుడు నగరి నియోజకవర్గ టీడీపీ నాయకుడు విజయబాబు సమక్షంలో ఎంపీటీసీ శ్రీజ భర్త నర్రా బాలాజీనాయుడు తెలుగుదేశం పార్టీలో చేరారు. నగరిలో తెలుగుదేశం పార్టీ గెలుపుకు కృషి చేస్తాన న్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వాణిజ్య విభాగ సెక్రటరీ రవినాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పెమసాని సుమన్‌నాయుడు, రావూరు శంకర్‌నాయుడు, ప్రవీణ్‌శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోవు ఎన్నికల్లో మరోసారి ప్రతిపక్షాలను మట్టి కరిపిస్తాం!

సిద్ధం శంఖారావం పూరించిన ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో శ్రీకాళహస్తి నియోజకవర్గంలో మరో సారి ప్రతిపక్షాలను జనం మట్టికరిపించుటకు 'సిద్దంగా' ఉన్నారని శాసనసభ్యుడు బియ్యపుమధుసూధనరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఎన్నికల శంఖారావాన్ని పూరించారు.ఈ సందర్భంగా ఎంఎల్‌ఏ మధుసూధనరెడ్డి మాట్లాడుతూ తాను ఓడిపోయినపుడు ఏర్పేడు మండలం అండగా నిలిచిందన్నారు.అదే మెజారిటి 2019 ఎన్నికల్లో కూడా తోడూ నీడగా నిలిచారన్నారు. ప్రత్యర్థులు ప్రజలకు లేని పోని మాయమాటలు,అబద్దాలతో మాయ చేయటానికి ప్రయత్నిస్తున్నారని వారి ఆరోపణలను వైకాపా నాయకులు తిప్పి కొట్టాలని పిలుపు నిచ్చారు.జగనన్న సంక్షేమ పథకాలతో లబ్ది పొందిన ప్రజలకు వాటిని వివరిస్తూ మన ప్రభుత్వం వస్తేనే పేదవారు సుఖ సంతోషాలతో ఉంటారని వివరించారు.శ్రీకాళహస్తిలో రాష్ట్రంలోఏ శాసనసభ్యుడు చేయని రీతిలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు జనాలకు అందుబాటులో ఉంటూ ప్రజలను ఆదుకున్నానని ఈ అంశాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. ఈ సమావేశంలో ఏర్పేడు మండల నాయకులు పాల్గొన్నారు. సోమవారం నుంచి తన తనయ బియ్యపు పవిత్రారెడ్డి ఏర్పేడు మండలంలో విస్తృతంగా పర్యటిస్తారని ఆమెకు నాయకులు సహకరించాలని ఆత్మీయ సమావేశంలో మధుసూధనరెడ్డి పిలుపు నిచ్చారు.

## బిసిలను దగా చేసిన జగన్‌మోహన్‌రెడ్డి

-బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తిరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



తన అధికార దాహన్ని తీర్చుకోవడానికి బిసి వర్గాలకు అలివికాని హామీలు ఇచ్చి తన మోసపూరితమైన కుట్రలతో బలహీన వర్గాల ఓట్లను గంపగుత్తగా వేయించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత బిసిలను దగా చేశాడని తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆరోపించారు. శ్రీకాళహస్తిరూరల్ మండలంలోని తొండమనాయుడు గ్రామంలో జయహో బిసి కార్యక్రమాన్ని మండల పార్టీ అధ్యక్షుడు కామేష్‌యాదవ్ మరియు బిసి విభాగ మండల అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ అత్యధికంగా ఓట్లు వేసేది మన బిసి సోదరులే అన్నారు. గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో గత నాలుగున్నర సంవత్సరాలుగా రాష్ట్రంలో బిసిలకు ఒరిగిందేమీ లేదని మాయమాటలతో బిసిల ఓట్లు దండుకుని ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చిన తర్వాత బిసిలను తన్ని చెత్తబుట్టలో పడేశాడని సుధీర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు డాక్టర్ జి.దశరధాచారి, రెడ్డివారిగురవారెడ్డి, మండల బిసి సెల్ అధ్యక్షులు పి.ఈశ్వర్‌రెడ్డి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు, రాష్ట్ర మహిళా నాయకురాలు రేణుకాదేవి, వన్నెకులక్షత్రియ సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ మునిరాజ, సభ్యులు మిన్నల్‌రవి, రాష్ట్ర సాంస్కృతిక కార్యనిర్వాహక కార్యదర్శి నెమళ్ళూరుబుజ్జి, తెలుగుయువత మీడియా రాష్ట్ర కోఆర్డినేటర్ కెవి.ప్రతాప్, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు కృష్ణయాదవ్, తిరుపతి పార్లమెంటు అధికార ప్రతినిధి చెంచయ్యానాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి బత్తిరెడ్డి, బిసి విభాగం పార్లమెంటు కార్యదర్శులు యంయస్‌రెడ్డి, నియోజకవర్గ అధ్యక్షుడు దొరైరాజ్‌రెడ్డి, తాటిపర్తిఈశ్వర్‌రెడ్డి, పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శివయ్య సన్నిధిలో బిజెపి జాతీయ నాయకులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



భారతీయ జనతాపార్టీ జాతీయ నాయకులు, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల కో ఇన్‌ఛార్జిలు పొంగులేటి సుధాకర్‌రెడ్డితో పాటు ఆదివారం శ్రీకాళహస్తీశ్వరాల యానికి విచ్చేశారు. ఈసందర్భంగా ఆయనకు రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్ స్వాగతం పలికి దర్శన ఏర్పాటు చేశారు. ఆలయంలో స్వామిఅమ్మ వార్లను ప్రత్యేకంగా దర్శించుకున్నారు. అనంతరం వీరికి ఆలయంలోని మృత్యుంజయస్వామి సన్నిధి వద్ద స్వామిఅమ్మవార్ల తీర్థప్రసాదాలతో పాటు శేషవస్త్రాలను అందించి సత్కరించారు. దర్శన ఏర్పాట్లు పర్యవేక్షించిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్, పట్టణ పార్టీ అధ్యక్షుడు గరికపాటిరమేష్‌బాబు, హరీష్, చందురాయల్, చైతన్య, సాయి తదితరులు పాల్గొన్నారు.

## ఏరియా ఆస్పత్రిలో క్యాన్సర్‌పై అవగాహన

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమాన్ని ఆస్పత్రిసూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి ఆదేశాల మేరకు డాక్టర్ మునిశ్రావణి ఆధ్వర్యంలో వైద్యులు, నర్సులు రోగులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా డాక్టర్ మునిశ్రావణి మాట్లాడుతూ ప్రజలకు క్యాన్సర్ వ్యాధిపై అవగాహ పెంచుకుని క్యాన్సర్ రహత సమాజాన్ని నిర్మించుకుందామన్నారు. దీన్ని తొలిదశలోనే గుర్తించి చికిత్స అందిస్తే నియంత్రణ సాధ్యమేనని ధూమపానం, పొగాకు ఉత్పత్తుల వాడకం, మద్యం సేవించడం దుర అలవాట్లకు దూరంగా ఉండే క్యాన్సర్ నుంచి కాపాడుకోవచ్చన్నారు. మహిళల్లో వచ్చే బ్రెస్ట్ క్యాన్సర్‌ను చికిత్స పొందుతూ వ్యాయామం ద్వారా తగ్గించుకోవచ్చని, ప్రతి ఒక్కరు వ్యాయామం చేయడం వల్ల వివిధ రకాల రోగాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్ళిన ఉపాధ్యాయునికి సత్కారం

తొట్టంబేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



మండలంలోని పెన్నలపాడు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ళపాటు విధులు నిర్వహించి ఇటీవల బదిలీపై దిగువసాంబయ్యపాళెం పాఠశాలకు వెళ్ళిన కయ్యూరు బాలసుబ్రమణ్యంను ఆదివారం పాఠశాల విద్యా ర్థులు, గ్రామస్తులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్క రించారు. పాఠశాల అభివృద్ధికి విద్యార్థుల ఉన్నతికి ఎనలేని కృషిచేశారని ఉపాధ్యాయున్ని కొనియాడారు. అనంతరం దుశ్శాలువతో సత్కరించి మెమొంటోను అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు దినకర్, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డిని కలసిన ఎంఎల్‌ఏ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త



పట్టణంలోని బైపాస్‌రోడ్డు వద్ద ఉన్న శివం కళ్యాణ మండపంవద్దరాష్ట్రఅటవీ,విద్యుత్,భూగర్భ గనులశాఖ మంత్రిపెద్దిరెడ్డిరామచంద్రారెడ్డినిఎంఎల్‌ఏ బియ్యపు మధుసూధన్‌రెడ్డిని మర్యాదర పూర్వకంగా కలసి దుశ్శాలువతోసత్కరించిశివయ్యతీర్థప్రసాదాలు అందిం చారు.వైకాపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి

వరదయ్యపాలెం, ఫిబ్రవరి 4, ప్రభాతవార్త

భవన నిర్మాణ కార్మిక సంఘం ఏఐటియుసి సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చంద్రబాబు ఆధ్వర్యంలో వరదయ్యపాలెంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు అంబాకం చిన్ని రాజ్ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికులు అనేక పోరాటాల నిర్వహించితే 2005వ సంవత్సరంలో భవన నిర్మాణ , ఇతర రంగాల కార్మికులకు సంక్షేమ బోర్డును ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ఇప్పుడున్న రాష్ట్ర ప్రభుత్వం దాన్ని నిర్వీర్యం చేయడమే కాకుండా 1450 కోట్లు సంక్షేమ నిధులు 1300 కోట్లను దారిమల్లించిందని తద్వారా భవన నిర్మాణ కార్మికులకు అందవల్సిన ప్రమాద భీమా పెళ్లి ప్రసూతి తదితర సంక్షేమ కార్మికులకు అందకుండా తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆయన అన్నారు. పాము కాటు, విద్యుత్ షాక్ వాహన భవన ప్రమాదాలకు గురైన కార్మికులు వేలాదది క్లైములు రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకుండా కార్మికులకు అన్యాయం చేస్తా ఉందని కార్మకుల సంక్షేమ బోర్డు నిధులను బోర్డుకు కేటాయించి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వేలాది క్లైమ్లను వెంటనే పరిష్కరించాలని చిన్ని రాజ్ డిమాండ్ చేసారు. ఈ సమావేశంలో భవన నిర్మాణ కార్మికుల సంఘం నియోజకవర్గ అధ్యక్షులు కోటేశ్వర రావు, ఏఐటియుసి నియోజకవర్గ ఉపాధ్యక్షులు చంద్ర సుబ్రమణ్యం, యూసుఫ్ బాయ్, భాష, భవన నిర్మాణ సంఘం నాయకులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## మృతి చెందిన వైకాపా మద్దతుదారులకు ఎమ్మెల్యే ఆర్థికసాయం

నారాయణవనం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త :



ఆదివారం సత్యవేడు నియోజకవర్గంలోని నారాయ ణవనం, పిచ్చాటూరు మండలాల్లో మృతి చెందిన వైకాపా మద్దతుదారులు ఇద్దరు అనారోగ్యంతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న సత్యవేడు ఎమ్మె ల్యే కోనేటి ఆదిమూలం, అతని తనయుడు జడ్పీ ఫైనాన్స్ కమిటీ మెంబర్ కోనేటి సుమన్ కుమార్‌లు ఆదివారం ఉదయం నారాయణవనం మండలం కశిమిట్ట దళితవాడకు చెందిన తోటి అవనాక్షయ్య మృతదేహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం బాధిత కుటుంబాన్ని ఓదార్చి 5వేల ఆర్థికసాయం అందించారు. అలాగే పిచ్చాటూరు మండలకేంద్రంలో మృతి చెందిన ఏసు మృతదేహానికి పూలమాలలువేసినివాళి అర్పించారు. అలాగే బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందించి ఆదుకున్నారు.

## ఆద్వానీకి భారతరత్న పురస్కారం ఆనందదాయకం

తిరుపతి,ఫిబ్రవరి 4ప్రభాతవార్త:



మాజీ ప్రధాని,బిజెపి సీనియర్‌నేత ఎల్‌కె అద్వానీకి భారత రత్న పురస్కారం అందించేలా కేంద్రం,ప్రధాని మోదీ తీసు కున్న నిర్ణయం శుభపరిణామమని బిజెపి నేతలు అన్నారు. అద్వానీకి భారతరత్న ప్రకటించడం ఆయన దేశసేవకు చేసిన కృషిని మరోసారి గుర్తుచేసుకోవడమేనన్నారు.అయోధ్యలో రామమందిరం నిర్మాణంలో ఆయన తీసుకున్న చొరవ అమోఘమన్నారు.ఆయన కలలుకన్న దేశం నేడు మోదీ పాలనలో నిజమవుతుందన్నారు. ఈ సందర్భంగా ఆదివారం బిజెపి నాయకులు గుండాలగోప నాథరెడ్డి , డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, సుబ్రమణ్యంయాదవ్, అజయ్‌కుమార్, విజయకుమార్, తొండ మానాటిసుబ్రమణ్యంరెడ్డి,జయంత్‌కుమార్, మురళి తదితరులు నగరంలో ప్రజలకు స్వీట్లు పంచిపెట్టారు.

## రేణిగుంట మండల బీజేపీ అధ్యక్షురాలుగా తేజోవతి

రేణిగుంట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



రేణిగుంట మండల బీజేపీ అధ్యక్షురాలుగా జి.పాళెంకు చెందిన తేజోవతి నియమిస్తూ బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్‌కుమార్, బీజేపీ రాష్ట్ర నేత స్పోక్స్ పర్సన్ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు చంద్రన్న నియామక పత్రాన్ని అందజేశారు. బీజేపీ నుంచి మొట్ట మొదటి ప్రధాన పార్టీకి అధ్యక్షురాలిగా తేజోవతి నియామకం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల స్థాయిలో కీలక బాధ్యతలు అప్పగించినందుకు రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు దగ్గుపాటి పురందేశ్వరి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కోలా ఆనంద్‌కుమార్, రాష్ట్ర బీజేపీ నేత, స్పోక్స్ పర్సన్ భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షులు చంద్రన్న, శ్రీకాళహస్తి నియోజకవర్గం కో-కన్వీనర్ మేళంగారి సుబ్రహ్మణ్యంరెడ్డి, బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా పదాధికారి లింగారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శులు బీడీ బాలాజీ, వరప్రసాద్‌లకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. మోదీ ప్రజారంజక పాలనను ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీని బలోపేతం చేస్తానన్నారు.

## చందనాలంకరణలో శ్రీ కాలభైరవ స్వామి

నగరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



నగరి పట్టణంలో వెలసిన శ్రీ కాలభైరవ స్వామి ఆలయంలో ఆదివారం విశేష అష్టమి సందర్భంగా ప్రత్యేక అభిషేక, అర్చనలు జరిగాయి. స్వామివారికి పాలు, పెరుగు, పంచామృతం, చందనం, విభూది, పన్నీరు, ఎల్లనీరు మొదలగు వాటితో విశేషమైన అభిషేకాలు జరిగాయి. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులకు విశేషాలంకరణ భక్తులను ఆకర్షించాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులందరికి ఆలయ నిర్వాహకులు చందనం, పసుపు, విభూది వివిధ రకాలైన ప్రసాదాలు భక్తులకు పంపిణీ చేశారు.

## వైసీపీ నుంచి టీడీపీలోకి 50 కుటుంబాలు చేరిక

నగరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



తెలుగుదేశంలో 50 కుటుంబాలు నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ ఆధ్వర్యంలో చేరారు. నగరి మున్సిపాలిటీ చింతలపట్టెడ దళితవాడకు చెందిన 50 కుటుంబాలు డి.బాబు, ఆర్.అలెక్స్, జి.కార్తవరా ఎన్.ఏ.శివ, టి.వెంకటన్, జి.ఆర్ముగం, కె.మున స్వామి, ఎస్.శశి, కె.మురుగన్, ఎన్.శాంతి సమక్షంలో వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. తెలుగుదేశం, భానుప్రకాష్‌తోనే తమకు మంచి భవిష్యత్ ఉంటుందని నమ్మి తెలుగుదేశంలో చేరినట్లు వారు పేర్కొన్నారు.

## టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు గుర్తింపు

– గాలి భానుప్రకాష్

వడమాలపేట, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:



టీడీపీ ఆవిర్భావంతోనే బీసీలకు మనుగడ, గుర్తింపు లభించిందని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. వడమాలపేటలో ఆదివారం జయహో బీసీ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల ప్రజలకు గుర్తింపు 33 శాతం రిజర్వేషన్ కల్పించింది నందమూరి తారకరామారావు అన్నారు. వెనుకబడిన వర్గాలకు రాజకీయ భవిష్యత్ మొట్ట మొదటిగా టీడీపీతోనే ప్రారంభమైందన్నారు. అప్పటి నుంచే బీసీలు టీడీపీకి వెన్నుముకలా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు చినబాబు, ధనంజయలునాయుడు, వెంకటయ్య, లక్ష్మీప్రసన్న, హేమావతి, ధనలక్ష్మి, ఉమాపతిరావు, మునిరత్నం, సుబ్రహ్మణ్యంరెడ్డి, రవిరెడ్డి, వెంకటేశ్వరరావు, రఘు, శివరాయ ల్, శ్రీనివాసులు, అదెయ్య, పెద్దబ్బరాజు, పుత్తూరు బీసీ నాయకులు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

## దేవాంగ కులస్తుల అభ్యర్థులకు పోటీచేసే అవకాశం కల్పించాలి

సత్యవేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:




రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటింగ్ శాతం అధికంగా ఉన్న స్థానాల్లో దేవాంగ కులస్తుల అభ్యర్థులకు కేటాయించి వారికి పోటీ చేసే అవకాశం కల్పించాలని రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మన్నె ముద్దు శ్రీనివాసులు ప్రధాన రాజకీయ పార్టీలను కోరారు. మంగళగిరిలో దీనిపై ఆదివారం జరిగిన దేవాంగ ఆత్మగౌరవ సభకు స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం నేతలు పలువురు మద్దతు పలికారు. ఈ సందర్భంగా సత్యవేడు ప్రెస్ క్లబ్‌లో స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో చీరాల, రాజమండ్రి రూరల్, హిందూపురం, పుట్టపర్తి వంటి అసెంబ్లీ నియోజకవర్గాల్లో దేవాంగ సామాజిక వర్గం అధికంగా ఉందన్నారు. ఇందులో భాగంగానే గతంలో కూడా సామాజిక వర్గానికి సంబంధించి రాజమండ్రి రూరల్‌లో చందన రమేష్, చీరాల్లో దివంగత చంద్రమౌళి, పుట్టపర్తిలో నిమ్మల కిష్టప్ప తదితరులు ఎమ్మెల్యేలుగా గెలిచిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. ఈ నేపథ్యంలోనే మంగళగిరిలో నిర్వహిస్తున్న దేవాంగ కులస్తుల ఆత్మగౌరవ సభకు పూర్తి మద్దతు పలుకుతున్నామన్నారు. అంతకు ముందు దేవాంగ ఆత్మగౌరవ సభకు సంబంధిం గోడ పత్రికలను సంఘం నేతలు ప్రదర్శించారు. ఈ సమావేశంలో రాష్ట్ర దేవాంగ సంక్షేమ సంఘం కార్యవర్గ సభ్యుడు యారాశి మురళీకృష్ణ, స్థానిక దేవాంగ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షులు మన్నే గణపతి, ఆర్గనైజర్ సెక్రటరీ మన్నే ఉదయ్‌కుమార్, ఉమ్మిట బాల గుర్రప్ప, జక్కల శివానందం, సుబ్రహ్మణ్యం, దేవాంగ సంఘం మీడియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తి త్యాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులలో రాజకీయ చైతన్యం రావలి

ఏర్పేడు, ఫిబ్రవరి 4,ప్రభాతవార్త;



తమ హక్కులను సాధించడానికి గిరిజనులలో రాజకీయ చైతన్య రావాలని యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మదురాంతకం మునిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని రాజులపాళ్యం ఎస్టీ కాలనీలో కోఆర్డినేటర్ అరుణ అధ్యక్షతన ఆదివారం గిరిజనులకు ఓటు యొక్క విలువ, రాజకీయాలపట్ల అవగాహన సదస్సును నిర్వహించారు. ఈసందర్భగా మాట్లాడుతూ గిరిజనులు గౌరవంగా బతికెందుకు వారిలో రాజకీయ చైతన్యం, అక్షరాస్యత పెరగాలని, అక్షరాస్యతను పెంచడం కోసం యువనేస్తం తరపున పలు గిరిజన కాలనీలలో విద్యను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. గిరిజనులు ఐక్యమత్యంతో ఉంటేనే రాజకీయంగా ఎదుగుతారని తెలిపారు. అలాగే ఓటు విలువ తెలుసుకోవాలని అది మీజీవితాలను మార్చే ఆయుధమని తెలిపారు. ఒక వ్యవస్థకు ప్రజాప్రతినిధి ఎంత అవసరమో ఆప్రజాప్రతినిధిని ఎన్నుకునేందుకు ఓటు అంతే అవసరం. కానీ చాలామంది ఓటును కేవలం ఎన్నికల ప్రక్రియగా రాజకీయ తంతుగా భావిస్తున్నారు. ఈమ పంథా మార్చుకొని మీరందరు కలసి కట్టుగా ఉండి మీ సమస్యలు మరియు మీ కాలనీలో ఉండే సమస్యలపై అవగాహన పెంచుకొని ప్రజాస్వామ్య బద్దంగా పోరాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో నాగమణి, వాలంటీర్లు వెంకటేష్, హేమ, ముత్యాలమ్మ, వాణి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మాన్ని వ్యతిరేకించలేదు

## -ధార్మికసదస్సులో టిటిడి చైర్మన్ భూమన

తిరుమల,ఫిబ్రవరి 4(ప్రభాతవార్తప్రతినిధి:అభ్యుదయ రాజకీయాల్లో ఉన్నా కూడా తాను భగవంతుడిని, సనాతన హిందూ ధర్మాన్ని వ్యతిరేకించలేదని టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి స్పష్టం చేశారు. హిందూ ధర్మాన్ని అచరించేందుకు ఇతర మతాలకు చెందిన వాళ్ళు తమకు తాముగా ,స్వచ్ఛందంగా ముందుకు వస్తే స్వాగతిస్తున్నా మన్నారు. హిందూ ధర్మప్రచారపరిషత్ ఆధ్వర్యంలో ఆస్థాన మండపంలో జరుగుతున్న ధార్మిక సదస్సు లో ఆదివారం రెండవరోజు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, మఠాధిపతులు, పీఠాధిపతులు పాల్గొన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామి దయతోనే రెండు సార్లు టిటిడి ఛైర్మన్, మూడు దఫాలు టిటిడి బోర్డు సభ్యుడు అయ్యాయని విశ్వాసం



వెలిబుచ్చారు. ధార్మిక సదస్సు లో స్వామీజీలు అందించే సలహాలు, సూచనలు పరిగణనలోనికి తీసుకుని సనాతన హైందవ ధర్మం పరిఢవిల్లేలా కార్యక్రమాలు చేస్తామని వివరించారు. ధార్మిక ప్రచారం కోసం టిటిడి చేస్తున్న కృషిని పలువురు స్వామీజీలు అభినందించారు. ఈ సమావేశంలో టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డి, టిటిడి తిరుమల శ్రీవారి ఆలయ కైంకర్యాలు పర్యవేక్షించే పెద్దజీయర్‌స్వామి,చిన్నజీయర్‌స్వామి, దేశంలోని పలువురు మఠాధిపతులు, పీఠాధిపతులు ముకుందమహరాజ్‌స్వామి, కమలానందభారతి, మన్నార్‌గుడి సెధాలంకార్‌స్వామి, సుబుదేంద్రతీర్థస్వామి, శఠగోప రామానుజజీయర్, సౌందర్యరంగరాజన్, ఇస్కాన్ రేవతిరమణదాస్, నారాయణజీమహరాజ్, స్వామి అనుపమానందస్వామి, విద్యావిజయతీర్థ స్వామి, విద్యావల్లభతీర్థ స్వామి, వెంకటేశుస్వామి తదితరులతోబాటు టిటిడి పండితులు పాల్గొన్నారు.

**-నభూతోనభవిష్యతిఅన్నట్లు: ఈఓ ధర్మారెడ్డి**

తిరుమల ఆస్థానమండపంలో నభూతోనభవిష్యతి అనేరీతిలో ధార్మికసదస్సు జరిగిందని టిటిడి ఈఓ ఏవి ధర్మారెడ్డితెలిపారు. మఠాధిపతులు, పీఠాధిపతులు తమ కీలక సూచనలు,సలహాలు ఇచ్చి టిటిడికి దిశానిర్దేశం చేశారన్నారు. మహనీయుల ఉపన్యాసాలను రికార్డుచేశామన్నారు. వీటిని తీర్మానాలుగా చేసి చివరిరోజు నేడు మఠాధిపతులు, పీఠాధిపతుల సమక్షంలో మీడియాప్రతినిధుల ముందు టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి ప్రవేశపెడతారన్నారు. సదస్సు లో తొలిరోజు 24మంది మహనీయులు, 17మంది మహనీయులు ప్రత్యక్షంగా వారి అనుగ్రహభాషణ చేశారు. 16మంది వర్చువల్‌గా తమ సూచనలు సలహాలు ఇచ్చారన్నారు.ధార్మికసదస్సు కు శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులు ఉన్నాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు.సదస్సు వందశాతం విజయవంతమైందని భావిస్తున్నామని ఈఓ తెలిపారు.

## నోబెల్ వరల్డ్ రికార్డు అందుకున్న సంధ్యారాణి



గూడూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : గూడూరు మాజీ ఎమ్మెల్యే సునీల్ కుమార్ సతీమణి సంధ్యారాణి యోగ విభాగంలో నోబెల్ వరల్డ్ రికార్డు సృష్టించినట్లు వసంత యోగ అకడమీ నిర్వాహకురాలు వసంతలక్ష్మి మీడియాకు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నగరానికి చెందిన వసంత యోగ అకాడమీ ఆధ్వర్యంలో గత సంవత్సరం నవంబర్ నెలలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన యోగా పోటీలలో గూడూరు పట్టణానికి చెందిన సంధ్యారాణి సూర్య నమస్కారాలు విభాగంలో నోబల్ రికార్డు స్థాపించారని తెలిపారు. సంధ్యారాణి సూర్య నమస్కారాలు నాన్‌స్టాప్‌గా 108 సార్లు అతి తక్కువ సమయంలో చేయడంతో ఆమె నోబల్ వరల్డ్ రికార్డ్ సృష్టించిన సంధ్యారాణి మీడియాకు తెలిపారు. ఆన్‌లైన్‌లో నిర్వహించిన యోగా పోటీలలో నోబెల్ వరల్డ్ రికార్డ్ సృష్టించిన సంధ్యారాణి ఆదివారం గూడూరు పట్టణంలోని ఆమె నివాసంలో మీడియాతో మాట్లాడుతూ వయసుతో నిమిత్తం లేకుండా ప్రతిఒక్కరు యోగ అలవాటు చేసుకోవాలని అభిలాషించారు. యోగా సాధన ద్వారా మానసిక ప్రశాంతత పొందడంతో పాటు ఆరోగ్యవంతంగా ఉంటామని పేర్కొన్నారు.

## మేత పోరంబోకు భూమిపై మీ పెత్తనం ఏమిటి



ఓజిలి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : ఓజిలి మండలం పెద్దపరియ రాచపాలెం గ్రామంలో మేత పోరంబోకు భూములను కొంతమంది ఆక్రమించేందుకు ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు. తరతరాలుగా ప్రతి గ్రామానికి మందబైలు, మేతపోరంబోకు భూములలో గేదెలు, మూగజీవాలు మేపుకునేందుకు కొంత భూమిని బ్రిటీష్ కాలంలోనే కేటాయించారు. నాటి నుంచి నేటి వరకు ఆ భూముల్లో మూగజీవాలను మేపుకుంటూ గ్రామస్థులు జీవనం సాగిస్తున్నారు. ఈ మేత పోరంబోకు భూమిని కొందరు వ్యక్తులు రెవెన్యూ అధికారుల సహాయంతో వాగులు, వంకలు కలిపి చదును చేసి ఇది తమ భూమి అంటూ, తాను లీజుకు తీసుకున్నట్లు బుకాయిస్తున్నారని గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ గ్రామంలో దాదాపు 40 ఎకరాలకు పైబడి మేత పోరంబోకు మందుబైలు ప్రభుత్వ భూములు ఆ గ్రామానికి చెందిన అందరికీ ఆ భూములపై హక్కు ఉందని, పశువులు మేపుకునేందుకు వీలుగా ఈ భూములు ఉన్నాయని, ఈ పరిసరాల్లో తప్ప ఇంకెక్కడ భూములు లేవని, యధాతధంగా ఉంచాలని, గ్రామానికి చెందే విధంగా రెవెన్యూ అధికారులు చొరవ తీసుకోవాలని మీడియాముఖంగా విజ్ఞప్తి చేశారు. కొందరు అధికారులు కొంతమంది వ్యక్తుల ప్రమేయంతో ఇక్కడ ప్రభుత్వ భూములు ఇష్టానుసారంగా ఆక్రమణలకు గురవుతున్నాయని, ఉన్నతాధికారులు స్పందించి స్వాధీనం చేసుకోవాలని, ఇటు గ్రామస్థులకు, మూగజీవాలకు జీవనాధారం కల్పించేలా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

## వైసిపి ఎంపిటిసి సభ్యురాలు టిడిపిలో చేరిక



పుత్తూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : రూరల్ మండలం పరిధిలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పరమేశ్వరమంగళం ఎంపిటిసి ఎస్.శ్రీజ తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆదివారం విజయవాడలోని టిడిపి ఆఫీసులో పార్టీ నగరి నియోజకవర్గ నాయకుడు పోతుగుంట విజయ్‌బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు సమక్షంలో ఆమె తన భర్త నర్రా బాలాజీనాయుడుతో కలిసి టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని, గత అయిదేళ్ల పాలనలో బడుగు, బలహీన వర్గాలు చాలా ఇబ్బందులు పడ్డాయని తెలిపారు. నగరిలో పార్టీ గెలుపునకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర వాణిజ్య విభాగం కార్యదర్శి ఇ.రవినాయుడు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి పెమ్మసాని సుమన్‌నాయుడు, ఎన్నారై రావూరు శంకర్‌నాయుడు, ఇంకా ప్రవీణ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## కాలువల్లో, రోడ్లపై చెత్త వేస్తే తగిన చర్యలు : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : తిరుపతి నగర పరిధిలో కాలువల్లో, రోడ్లపై చెత్త వేస్తే తగిన చర్యలు తీసుకుంటామని నగర పాలక కమిషనర్ అధితి సింగ్ హెచ్చరించారు. ఆదివారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో జరిమానాలు విధించిన కమిషనర్ నగరంలోని 18,19,20 వార్డుల్లో మాస్టర్ పాయింట్లను పరిశీలించి, సీతమ్మ రోడ్డు, మహిళా యూనివర్సిటీ రోడ్డు, ఎస్వీ నగర్ రోడ్డు, ప్రకాశం రోడ్డు, గాంధీ రోడ్డులను పరిశీలించారు. కమిషనర్ అధితి సింగ్ బండ్లను కడిగి రోడ్డుపైకి ఆ నీటిని వదులుతున్న ఒక షాప్ వారికి జరిమానా విధించమని కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. టీ షాపు వద్ద చెత్త వేసి ఉండడంతో వారికి, పూల మార్కెట్ వద్ద ప్లాస్టిక్ కవర్లు వినియోగిస్తుండడాన్ని గమనించి వారికి కూడా జరిమానాలు విధించమని ఆదేశాలు జారీ చేసారు. కొన్ని చోట్ల కాలువలు శుభ్రం చేయించాలని పారిశుద్ధ్య సిబ్బందికి ఆదేశాలు జారీ చేసారు. అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ అధితి సింగ్ మాట్లాడుతూ తిరుపతిని పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రజలందరి పైన ఉందన్నారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, శానిటరీ సూపర్‌వైజర్ చెంచయ్య ఉన్నారు.

## వైసీపీలో అనూహ్యంగా మారుతున్న పరిణామాలు

సత్యవేడు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గం వైసీపీలో స్థానికేతర అంశం చర్చనీయాంశంగా మారుతోంది. వైసీపీ అధిష్టానం అభ్యర్థిగా గంగాధరనెల్లూరుకు చెందిన నూకతోటి రాజేష్‌ని ప్రకటించడంతో పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో అతడి స్థానికతను ప్రశ్నించడంతో పాటు స్థానికులకే టికెట్ ఇవ్వాలన్న డిమాండ్ పెరుగుతోంది. టికెట్ తమకు కావాలంటే తమకు కావాలని సోషల్ మీడియాలో పలువురు నేతలు తమ వాదనలు వినిపిస్తున్నారు. నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, విశ్రాంత ఉద్యోగులు అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ నాయకులను ప్రసన్నం చేసుకునే పనిలో పడ్డారు. కొందరు నేతలు ప్రెస్‌మీట్లు పెట్టి మరి బహిరంగంగానే అభ్యర్థిస్తున్నారు. కేవీబీ పురం మాజీ జడ్పీటీసీ దేవిడ్, సత్యవేడు మాజీ ఎంపీటీసీ రవి, తొండూరు మాజీ సర్పంచ్ కవిత, రిటైర్డ్ ఏఈ మురళి, బ్యాంకు మేనేజర్ మనోహర్ తదితరులు టికెట్ కోరుతూ సోషల్ మీడియా వేదికగా డిమాండ్ చేస్తుండడం ప్రస్తుతం సత్యవేడు వైసీపీలో నెలకొన్న తాజా పరిణామాలకు నిదర్శనమని చెప్పుకోవచ్చు. ఎన్నికల నాటికి వైసీపీలో మళ్లీ అభ్యర్థిని మారుస్తారన్న ఊహాగానాలు వినబడుతున్నాయి. దీంతో నియోజకవర్గ తెరపై వైసీపీ అభ్యర్థిగా మరోపేరు వినిపిస్తోంది. సత్యవేడు, నాగలాపురం మండలాల్లో ఇది వరకు పని చేసిన ఓ పోలీసు అధికారి భార్య పేరు వినిపిస్తోంది. ఈమె శుక్రవారం వరదయ్యపాళెం మండలంలో పలువురు నాయకులను కలిసి మంతనాలు జరిపినట్లు సమాచారం. ఇదిలా ఉండగా వైసీపీ అధిష్టానం ప్రకటించిన నూతన అభ్యర్థి రాజేష్ ఇంకా నియోజకవర్గంలో అడుగుపెట్టకపోవడం చర్చనీయాంశంగా మారింది. సత్యవేడు నియోజకవర్గం వైసీపీ, కాంగ్రెస్ పార్టీలో రోజు రోజుకి ఒక్కో మలుపు తిరుగుతున్న ఆసక్తికర పరిణామాలు. అధిష్టానం అభ్యర్థిత్వాన్ని ప్రకటించి రెండు రోజులవుతున్నా ఇంకా నియోజకవర్గం మొహం చూడకపోవడం, నాయకులను, కార్యకర్తలను ప్రత్యక్షంగా కలవకపోవడం, కార్యాచరణపై చర్చించకపోవడం విశేషం.చూడాలి మరి అధిష్టానం ఏ నిర్ణయం తీసుకుంటుందో...

## జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు

తిరుపతి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల బాడీ బిల్డింగ్ పోటీలు ఈనెల 18న తిరుపతి యూత్ హాస్టల్‌లో బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్వర్యంలో జరుగుతాయని అధ్యక్షులు డా॥ ఈశ్వర్ ప్రకాష్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్ తెలిపారు. తిరుపతి జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ పోటీలు జరుగుతాయన్నారు. 55కిలోలు, 60,65,70,75, 80,85, 90 కిలోల విభాగాల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. మాస్టర్స్ బాడీ బిల్డింగ్ పోటీలు, మెన్ ఫిట్‌నెస్ పోటీలు, మెన్ మోడలింగ్ ర్యాంప్ వాక్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వివరాలకు 9505873777,7013274433,7097911007సంప్రదించాలని కోరారు.

## స్విమ్స్‌లో క్యాన్సర్‌పై అపోహలు-అనార్థాలు అనే అంశం పై చర్చ



తిరుపతి టౌన్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : స్విమ్స్ శ్రీ బాలాజీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అంకాలజి విభాగం ఆధ్వర్యంలో ఆదివారం ప్రపంచ క్యాన్సర్ దినోత్సవంలో భాగంగా క్యాన్సర్ పై అసోఆలు, అనార్థలు అనే అంశం పై ప్యానల్ చర్చ శ్రీ పద్మావతి ఆడిటోరియంలో నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్, బాలాజి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆంకాలజి ప్రత్యేకాధికారి డా. ఎం.జయచంద్రరెడ్డి, డిఎంహెచ్ఓ డా. శ్రీహరి, కమ్యూనిటి మెడిసిన్ డా. నాగరాజు, డా. బివి సుబ్రమణ్యం, డా. ప్రాణబంధు దాస్, డిపిఎం డా. శ్రీనివాస్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్వి కుమార్ మాట్లాడుతూ క్యాన్సర్ పై వున్న అపోహలు అనార్థాలు క్యాన్సర్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు క్యాన్సర్ వస్తే ఎటువంటి చికిత్స తీసుకోవాలి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వివిధ విభాగాల నుండి వచ్చిన వైద్యుల ద్వారా ప్రశ్నలకు నివృత్తి చేసుకోవాలన్నారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా.ఆర్వి కుమార్ అడిగిన ప్రశ్నకు ప్రాణాంతక వ్యాధులు చాలా ఉన్నాయి కదా? దానిలో క్యాన్సర్ పాత్ర ఏమిటి అన్న ప్రశ్నకు సమాధానంగా? లక్ష మందికి 13476 మంది క్యాన్సర్ సోకుతుందని సరాసరి 9 మందిలో ఒక్కరు క్యాన్సర్‌తో బాధపడుతు న్నారని, చర్చలో పాల్గొన్న వైద్యులు సమాధానం ఇస్తూ.. మగవారిలో చెడు వ్యాసనాల ద్వారా ఊపిరితిత్తులు.. నోటి క్యాన్సర్ అనేది ముందు తరంలో కంటే ఎక్కువగా వస్తుందా? ఇప్పుడు నిజంగానే ఎక్కువ అవుతుందా అన్న ప్రశ్నకు.. ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం ద్వారా ఈ వ్యాధిని కనుక్కోవడం వల్ల ఎక్కువ అవుందా అన్న ప్రశ్నకు ఇంటింటికి వెళ్లి క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం ద్వారా ఈ వ్యాధిని కనుక్కోవడం వల్ల ఎక్కువ క్యాన్సర్ వ్యాధి బయటపడుతుంది. ఈ ప్యానల్ చర్చిలో డా. మౌర్యరెడ్డి, మెడికల్ అంకాలజి, డా. నగేష్ సర్జికల్ అంకాలజి, డా. శ్రీనివాస్ రేడియేషన్ అంకాలజి, డా. ఐశ్వర్య కమ్యూనిటి మెడిసిన్, డా. సుగుణ పాథాలజి పాల్గొన్నారు. తిరుపతి జిల్లాకు చెందిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుంచి ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, మిడ్ లెవెన్ హెల్త్ ప్రొవైడర్స్, స్విమ్స్ సిబ్బంది, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. క్యాన్సర్ గురించి ప్రజలకు ఎలా తెలియజేయాలో కరపత్రాలు కూడా వీరికి అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంఓ డా. కోటిరెడ్డి, డా. నరేంద్రమెడికల్ అంకాలజి, సర్జికల్ అంకాలజి, రేడియేషన్ అంకాలజి కమ్యూనిటి మెడిసిన్ వైద్యులు పాల్గొన్నారు.

## బోయకొండకు పోటెత్తిన భక్త జనం

బోయకొండ(చౌడేపల్లి), ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కొండ దినం కావడంతో రాష్ట్రం నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు తదితర ప్రాంతాల వారు తరలిరావడంతో అమ్మవారి ఆలయం భక్తజనసంద్రమైంది. రణభేరీ గంగమ్మ ఆలయం నుంచి సన్నిధానానికి వెళ్ళే నడకమార్గంలో వాహన రాకపోకలకు కొంతమేర అంతరాయం వాటిల్లింది. ఉదయాన్నే వేదపండితులు, అర్చకుల ఆధ్వర్యంలో అమ్మవారికి విశేషాభిషేకం అలంకరణ గావించారు. వైకాపా రాష్ట్ర కార్యదర్శి పెద్దిరెడ్డి అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు. ఛైర్మన్ నాగరాజరెడ్డి, ఇఓ చంద్రమౌళి, ఆలయ అర్చక, అధికార, సిబ్బంది భక్తులకు సేవలందించారు.

## గణనాధుని దర్శించుకున్న నూతన డీఎస్పీ



కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: చిత్తూరు నూతన డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాజగోపాల్ రెడ్డి ఆదివారం విఘ్ననాయకుడైన కాణిపాకం శ్రీవరసిద్ది వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన వారికి ఆలయ ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వారి వెంట చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి, స్థానిక ఎస్సై శ్రీనివాస్, ఆలయ ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉభయదారుల లేకుండా పుస్తకావిష్కరణ చేపడితే ఆందోళన



కాణిపాకం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: దేవస్థానం అభివృద్ధిలో కీలకమైన ఉభయదారుల ప్రమేయం లేకుండా శ్రీవరసిద్ది వినాయక వైభవం,ఉపాసన విధానము గ్రంథం కార్యాచరణ, ఆవిష్కరణ చేపడితే భారీ ఎత్తున ధర్నా, నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కాణిపాకం ఆలయ ఉభయదారుల కమిటీ ఏకగ్రీవంగా తీర్మానించింది. ఆదివారం కాణిపాకం శ్రీమణికంఠేశ్వరాలయంలో ఆలయ ఉభయదారుల కమిటీ ఛైర్మన్ ఈశ్వర్‌బాబు అధ్యక్షతన కాణిపాకం దేవస్థానం ఉభయదారుల ప్రత్యేకసమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా పలు అంశాలపై ఉభయదారులు సుదీర్ఘంగా చర్చించారు. ఇందులో భాగంగా వెయ్యేళ్ల చరిత్ర కలిగిన కాణిపాకం మహా క్షేత్రం గురించి ఆలయ చరిత్ర గురించి అవగాహన లేని వ్యక్తులు స్థల పురాణాన్నే మార్చే విధంగా శ్రీవరసిద్ది వినాయక వైభవం,ఉపాసన విధానము గ్రంధంను తీసుకువస్తున్నట్లు తెలిపారు.అలాగే ఉభయదారుల ప్రమేయం లేకుండా పుస్తకం కార్యాచరణ, ఆవిష్కరణ చేపడితే ధర్నా, నిరసన కార్యక్రమాలను పెద్దఎత్తున నిర్వహించాలని నిర్ణయించారు. అలాగే ప్రతి నెలా సంకటహర చతుర్థి రోజున ఆలయంలో స్వామివారికి నిర్ణయించే బంగారు రథోత్సవంను ఆలయ ఉభయదారులే బ్రహ్మోత్సవాల తరహాలో అంగరంగ వైభవంగా నిర్వహించాలని సమావేశం తీర్మానించింది. ఈసమావేశంలో స్థానిక సర్పంచ్ కెఎస్.శాంతి సాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు సుధీర్‌లతో పాటు ఆలయ ఉభయదారులు పాల్గొన్నారు.

## చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

### - టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు రఘురామరాజు.. సింధూజ



కుప్పం, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : మాజీ సిఎం చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘురామరాజు, అంబూరు సింధూజ పేర్కొన్నారు. టెక్కలి నుంచి ప్రారంభించిన కార్మిక చైతన్యయాత్ర కుప్పంలో ముగిసింది. ఈసందర్భంగా టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ఉన్న కార్మికులను చైతన్యం పరచాలనే ఉద్దేశంతోనే తాము కుప్పం దాకా ఈ యాత్ర చేపట్టామన్నారు. కార్మిక రంగానికి గతంలో చంద్రబాబునాయుడు చేసిన లబ్దిని ఆయా ప్రాంతాల్లో కార్మికులకు వివరించామన్నారు. తెదేపా ప్రభుత్వం అధికారంలో రాగానే అమలు చేసే సూపర్ సిక్స్ పథకాలతో కార్మికుల జీవితాల్లో మార్పులు వస్తాయన్నారు.జనవరి 6న టెక్కలిలో రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా ఈయాత్ర ప్రారంభమై 23 పార్లమెంటు, 102 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 3347కి.మీ.ల మేర కుప్పం దాకా కొనసాగిందన్నారు. కుప్పం ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ తెదేపా పాలనలో రాష్ట్రమంతటా పరిశ్రమలు తెచ్చి కార్మికులకు ఉపాధి కల్పించడం జరిగిందన్నారు.కుప్పం పట్టణంలో 33 ఎకరాల్లో ఆటో నగర్ ప్రారంభిస్తామన్నారు. కుప్పం పూలమార్కెట్ వద్ద సైతం కార్మికులతో మాట్లాడారు. కార్యక్రమాల్లో జోన్ 1, 2ఇన్‌చార్జులు లెనిన్, సబ్బతి ఫణేశ్వరరావు, ఉపాధ్యక్షుడు పరుచూరి ప్రసాద్, మల్లికార్జున రావు, నాగోతు శివాజీ, లింగంపల్లి మోహనరావు, సూర్య, మాధవన్, రాజ్‌కుమార్, గోపీనాథ్, సత్యేంద్రశేఖర్, డా॥ వెంకటేష్, కేశవ, చరణ్, శేషు, సత్య, శ్రీకాంత్, సుగుణాకర్, నవీన్, రాజేష్ బృందం పాల్గొన్నారు.

## నడిరోడ్డుపై కన్నతల్లిని వదిలేశారు!



పుంగనూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : పుంగనూరులో ఆదివారం ఒక కొడుకు తన తల్లిని నడిరోడ్డుపై వదలి వెళ్ళిపోయిన సంఘటన జరిగింది. జీవితమంతా రెక్కలు ముక్కలు చేసుకుని పెంచిపోషించుకున్న కన్నకొడుకు ఇలా నడిరోడ్డుపై తనను వదలి వెళ్ళిపోవడంతో సరిగా చూపు ఆనని,దిక్కుతోచని స్థితిలో వృద్ధురాలైన ఆ తల్లి బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తలదాచుకుంది. మండలంలోని మీర్జేపల్లికు చెందిన అక్కులమ్మ అనే ఎనభై ఏళ్ళ వృద్ధురాలు ఆదివారం మధ్యాహ్నం పట్టణంలోని బసవరాజ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో దయనీయంగా కనుపించింది. అప్పటికే ఆమె రోడ్డుపై నుంచి ప్రాక్కుంటూ పాఠశాల ఆవరణలోనికి రావడాన్ని గమనించిన స్థానికులు ఆమె వివరాలు కనుగొన్నారు, మండలంలోని మీర్జేపల్లికు చెందిన తన పేరు అకు కులమ్మ అని,తాను తన కొడుకు గణేష్‌తో పాటూ పట్టణానికి వచ్చానని ఆమె తెలిపింది. ఎందుకో తన కొడుకు గణేష్ ఇపుడే వస్తానని చెప్పి రోడ్డుపై దించి వెళ్ళిపోయాడన్నారు. నడవలేని తాను ఏవాహనానికింద అయినా పడిపోతాననే భయంతో ప్రాక్కుంటూ బడి ఆవరణలోనికి వచ్చానని ఆమె తడబడుతూ వివరించింది. కన్నతల్లిని ఇలా రోడ్డుపై వదలి వెళ్ళడంపై పట్ల ఆమె కుమారుడు గణేష్ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియచేశారు.

## టిడిపి అధికారం చేపట్టాక బీసీలకు ప్రత్యేక చట్టం తీసుకువస్తాం

### -మాజీ మంత్రి అమరనాథరెడ్డి

పలమనేరు,ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: టిడిపి వెన్నెముక లాంటి బీసీలను కంటికి రెప్పలా కాపాడుకుంటామని టిడిపి అధికారం చేపట్టాక బీసీలకు ప్రత్యేక చట్టం తెస్తామని మాజీ మంత్రి అమరనాథరెడ్డి హామీ ఇచ్చారు.పట్టణంలో టిడిపి బీసీ సెల్ ఆధ్వర్యంలో ఆదివారం జయహో బీసీ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి అధికారంలోనే బలహీన వర్గాలకు రాష్ట్రంలో ప్రత్యేక గుర్తింపు లభించిందన్నారు.ఆనాడే రాజకీయంగా, సామాజికపరంగా బీసీలను ముందుకు తీసుకొచ్చి చదువుకున్న బీసీ యువకులను శాసనసభ్యులుగా ,మంత్రులుగా టిడిపి తీసుకువచ్చిందన్నారు.బీసీలకు స్థానిక సంస్థలలో 34శాతం రిజర్వేషన్ కల్పిస్తే దాన్ని ఈ ప్రభుత్వం 24 శాతానికి తగ్గించి 10 శాతం బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో జగన్ రెడ్డి అవకాశాన్ని పోగొట్టారన్నారు.వైకాపాను బీసీలు నమ్మే పరిస్థితి లేదని బీసీలను వైకాపా పూర్తిగా మోసం చేసిందని విమర్శించారు.ఈ కార్యక్రమలో రాష్ట్ర నాయకులు దంపూరి భాస్కర్ యాదవ్,జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్,పార్టీ పరిశీలకులు జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## జగన్ కబంధ హస్తాల నుంచి రాష్ట్రాన్ని రక్షించడానికే రా కదలిరా



గంగాధర నెల్లూరు ఫిబ్రవరి 4 ప్రభాత వార్త: రాష్ట్రాన్ని జగన్ కబంధ హస్తాల నుండి రక్షించడానికి రా కదలిరా కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నామని అన్నారు. మంగళవారం మధ్యహ్నం నియోజక వర్గ కేంద్రమైన గంగాధర నెల్లూరులో నిర్వహించనున్న రా కదలిరా కార్యక్రమానికి తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు హాజరవుతున్నారని ఈ కార్యక్రమానికి సుమారు రెండు లక్షల మంది ప్రజలు హాజరవుతారని నాయకుల అంచనా వేశారని, వీరందరు ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలతో విసిగి వేసారి ప్రత్యామ్నాయం కోసం తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. హాజరయ్యే రెండు లక్షల మంది ప్రజానీకానికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా నాయకులు దగ్గరుండి చూసుకోవాలని, అలాగే సభలో కూడా జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అరాచకాలను దోపిడీలను ప్రజలకు తెలియ చేప్పాలని అలాగే ఈ సభమద్దతుగా అంగన్వాడీ వర్కర్లు,108 సిబ్బంది, ఉపాధ్యాయులు లాంటి ప్రభుత్వ ఉద్యోగులు ఎందరో తెలుగుధేశం పార్టీకి మద్దతు తెలుపుతున్నారన్నారు. గంగాధర నెల్లూరు నియోజకవర్గంలో మా అభ్యర్థి తామస్ విజయం సాధించి తెలుగుదేశం జెండా ఎగురవేయడం ఖాయమని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పులిపర్తి నాని రాష్ట్ర మహిళ ఉపాధ్యక్షురాలు వైవి రాజేశ్వరి శరవణ,బాబు, సంపత్,దీపక్, ప్రకాష్ నాయుడులతో పాటు పలువురు జిల్లా,మండలస్థాయి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## శ్రీశక్తి చాముండేశ్వరి దేవి మహా కుంభాభిషేకం మహోత్సవం



తిరుపతిరూరల్, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త:తిరుపతిరూరల్ మండలం తుమ్మల గుంటలో వెలసిన శ్రీ శక్తి చాముండేశ్వరి దేవి మహ కుంభాభిశేకం మహోత్సవాన్ని పురస్కరించుని ఆదివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి, భక్తులకు దర్శనానికి అనుమతి ఇచ్చారు. అమ్మవారి మహ కుంభాభిశేకం మహోత్సవాన్ని పురస్కరించుకుని అమ్మవారికి ప్రత్యేక అభివేకంతో పాటు, ప్రత్యేక అలంకరణతో పాటు భక్తులకు మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉభయదారులు బిరుదాల భాస్కర్‌రెడ్డి, బిరుదాల హర్షిత్‌రెడ్డి, దేశిరెడ్డి రామతులసి, దేశిరెడ్డి నాగమునిరెడ్డి, అనిత, లక్ష్మీ, పార్లపల్లి భారతి తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు దేశం ఎంపి టికెట్‌కోసం...పెరుగుతున్న ఆశావహులు

### -తాజాగా తెరపై డాక్టర్ సురేంద్రబాబు పేరు



పుంగనూరు, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త : చిత్తూరు ఎంపి ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానం నుంచి పోటీచేయడానికి ఆశావహులు రోజు రోజుకూ పెరుగుతున్నారు. జిల్లాలోని పలు అసెంబ్లీ నియోజకవర్గాల అభ్యర్థులు కూడా ఖరారు కాకపోతుండడంతో దేశం అధినేత చం ద్రబాబునాయుడు ఈదఫా జిల్లాలో అత్యధిక స్థానాలను కైవశం చేసుకోడానికి పక్కా వ్యూహంతో ఉన్నట్లు వెల్లడౌతోంది. కొత్త అభ్యర్థులు గా యువకులను రంగంలోనికి దించాలని, ప్రజాసేవా రంగంలో ఉన్న వారిని ప్రాధాన్యతతో ముందుకు నడిపేందుకు చాలా మంది అభ్యర్థిత్వాలు పరిశీలిస్తున్నట్లు వెల్లడౌతోంది. తాజాగా చిత్తూరు దేశం ఎంపి టిక్కెట్టుకు నియోజకవర్గంలోని చౌడేపల్లికు చెందిన డాక్టర్ సురేంద్రబాబు పేరు తెరపైకి వచ్చింది. చౌడేపల్లిలో మారుమూల గ్రామంకు చెందిన డాక్టర్ సురేంద్రబాబు సమాజానికి కొత్తేమీ కాదు. ఆయన పదోతరగతిలో ఫస్ట్‌క్లాస్ ఉత్తీర్ణుడై సెలవులలో తన గ్రామానికి వచ్చి ఉపాధిహామీ పథకంలో కూలీగా పనిచేశారు.2001లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నుంచి ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఆతరువాత కూలిపనులు చేసుకుంటూనే చిత్తూరులో ఇంటర్ పూర్తి చేసి,2005లో ఎంసెట్ లో ఫ్రీసీటు సాధించి,ఉస్మానియాలో ఎంబిబిఎస్ పూర్తి చేశారు. ఆతరువాత ఆయన పీడియాట్రీషన్ పూర్తిచేసి పేదల డాక్టర్‌గా పేరుసాధించారు. తెలంగాణాలో రాజకీయ పలుకుబడి కలిగిన డాక్టర్ సురేంద్రబాబు లోకేష్ యువగళం కార్యక్రమంలో భాగంగా గతంలో నెల్లూరులో ఆయనను కలసి, చిత్తూరు ఎంపి టిక్కెట్టుకు తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని కోరారు. ఇప్పటికే డాక్టర్ సురేంద్రబాబు అభ్యర్థిత్వంపై పార్టీ సంస్థాగత విచారణలు కూడా పూర్తయ్యాయని తెలుస్తోంది. ఆర్థికపరంగా సామాజిక పరంగా ఉన్నత స్థాయిలో ఉన్న డాక్టర్ సురేంద్రబాబు పేరును డాక్టర్లు, మేధావులు ప్రతిపాదిస్తున్నట్లు తెలిసింది.ఏది ఏమైనా ఇప్పటి వరకు అభ్యర్థుల పేర్లు ప్రకటించడంలో లోతుగా వ్యవహరిస్తున్న తెలుగుదేశం పార్టీ అధినాయకులు డాక్టర్ సురేంద్రబాబు అభ్యర్థిత్వంపై ఎలా స్పందిస్తారన్న విషయం వేచి చూడాల్సిందే...

## మత్తు రహిత చంద్రగిరి లక్ష్యం..!

### రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధా యాదవ్



చంద్రగిరి, ఫిబ్రవరి 4 ప్రభాతవార్త: చంద్రగిరి నియోజకవర్గాన్ని మత్తు రహిత కేంద్రంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని రాష్ట్ర ఓబిసి ఫోరం కన్వీనర్ బడి సుధా యాదవ్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బడి సుధా యాదవ్ నాయకత్వంలో తొండవాడ శ్రీఉగ్రప్రత్యంగిరాదేవత ఆలయం నుండి సాగిన భారీ ర్యాలీ ఇప్పటి వరకు జిల్లాలో మరెవ్వరూ నిర్వహించని రీతిలో కనుచూపు మేర వేలాధిగా జనసందో హమై తరలివచ్చి చంద్రగిరి టవర్ క్లాక్ వద్దకు చేరుకున్నారు. ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఆంధ్రప్రదేశ్, ఆంధ్రప్రదేశ్‌కు చంద్రగిరి గంజాయి కేంద్రాలుగా మారినట్లు దుయ్యబట్టారు. గంజాయి మత్తులో పట్టపగలే షాపుల్లోకి ప్రవేశించి భౌతికదాడులకు పాల్పడటం జరుగుతున్నట్లు తెలిపారు. తిరుచానూరు కేంద్రంగా విచ్చలవిడిగా సరఫరా అవుతున్న గంజాయి పచ్చని గ్రామాలను మత్తుకు బానిసలుగా మార్చేస్తున్నట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి మత్తుకు వ్యతిరేకంగా ఏదైనా చేయాలనే సంకల్పంతో ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం రోజున మత్తుకు వ్యతిరేకంగా ఈ ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు.